




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

## ఉత్తరాంధ్ర
విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం

గురువారం 15-5-2025 పేజీలు: 15




# దోమలపై దండయాత్ర

- నగరంలో దోమల నియంత్రణకు జీవీఎంసీ చర్యలు
- వ్యాధి కారక దోమల గుర్తింపునకు కసరత్తు
- మస్కిటో ట్రాప్ మెషిన్ల ఏర్పాటుకు యోచన
- ఇందుకోసం మస్కిటో అనే సంస్థతో సంప్రదింపులు
- ట్రయిల్ రన్‌లో ఒకటి, రెండు జోన్లలో ట్రాపర్ల ఏర్పాటుకు ఆలోచన
- త్వరలోనే వీటి పనితనంపై అధ్యయనానికి హైదరాబాద్‌కు అధికారులు

(మేజర్ న్యూస్, సిటీ ప్రతినిధి)

నగరంలో దోమలపై దండయాత్రకు జీవీఎంసీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ సారి కాస్త భిన్నంగా హైటెక్ పద్ధతిలో దోమల నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. దోమల నియంత్రణతో పాటు ఏయే వ్యాధికారక దోమలు, ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయన్న విషయాన్ని గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ఇందుకోసం అమెరికా ఆధారిత కంపెనీ 'మస్కిటో'తో ఒప్పందానికి సమాలోచన చేస్తున్నారు. ఈ కంపెనీ రూపొందించిన మస్కిటో ట్రాప్ మెషిన్లను నగరంలో ఏర్పాటు చేసే విషయంపై కసరత్తు చేస్తున్నారు. వీటి పనితీరును స్వయంగా పరిశీలించేందుకు అధికార బృందం హైదరాబాద్, తిరువనంతపురంకు వెళ్లనున్నారు. అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసిన తరువాత పూర్తి స్థాయి నివేదికను రూపొందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుగ్ళి ళ్లాలని భావిస్తున్నారు.

### దోమలపై 'స్మార్ట్' ఫైట్

విశాఖలో దోమలు లేని ప్రాంతం లేదు. దోమలతోనే సకల రోగాలు వస్తాయనడంలో సందేహం లేదు. వీటి నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అవి సత్ఫలితాలివ్వడం లేదు. ముఖ్యంగా దోమలు ఉండే మురికివాడలు, గెడ్డలు, మురికి కాల్వల్లోకే కాకుండా ఇంటింటికి వెళ్లి పిచికారి చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో చికున్ గున్యా, మలేరియా, డెంగీ, ఎబోలా తదితర ప్రాణాంతక వ్యాధులతో మనుషుల జీవితాలతో చెలగాటమాడుతున్న దోమలపై స్మార్ట్ ఫైట్ చేయాలని జీవీఎంసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం (తరువాయి 2వ పేజీలో)

### దోమల నివారణకు చర్యలు



వర్షాకాలానికి ముందే దోమల నివారణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఈసారి సాంకేతికతతో దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని భావిస్తున్నాం. ఇందుకోసం ఒక కంపెనీలో సంప్రదింపులు జరుపుతున్నాం. నగరంలో మస్కిటో ట్రాప్ మెషిన్లు ఏర్పాటు చేయడం ద్వారా దోమల నివారణతో పాటే ఏయే ప్రాంతాల్లో ఎటువంటి వ్యాధికారక దోమలు ఉన్నాయో గుర్తించడం సులభమవుతుంది. తద్వారా ఆయా ప్రాంతాల్లో వాటి నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతంది. త్వరలోనే దీనిపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేసి కమిషనర్ దృష్టికి తీసుకువెళతాం.

డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్‌కుమార్, సీఎంహెచ్ఓ, జీవీఎంసీ



# విశాఖకు అన్ని మంచి శకునములే

## మెట్రో రైల్ ప్రాజెక్టుకు రుణమిచ్చేందుకు ముందుకొచ్చిన విదేశీ బ్యాంకులు

- ప్రభుత్వంతో చర్చలు జరపటమే తరువాయి
- త్వరలో అందుబాటుకు రానున్న భోగాపురం ఎయిర్‌పోర్టు
- ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి సిద్ధమవుతున్న మాస్టర్ ప్లాన్

(విశాఖపట్నం, రీజనల్ బ్యూరో చీఫ్)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు కీలక ప్రాజెక్టులను మంజూరు చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ఇప్పటికే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణపరులు 90 శాతానికి పైగా పూర్తయి. మరికొద్ది నెలల్లో ఈ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. అదేవిధంగా విశాఖపట్నం-భోగాపురం మధ్య ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి మాస్టర్ ప్లాన్స్ సిద్ధమవుతోంది. మరోపక్క విశాఖ నగరంలో ఐటీ పార్కులను శరవేగంగా ఏర్పాటు చేస్తోంది కూటమి ప్రభుత్వం. ఇదిలా ఉండగా విశాఖలో మెట్రో రైల్ ప్రాజెక్టు నిర్మాణాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. వీలైనంత త్వరగా మెట్రో ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు రుణాలు ఇవ్వడానికి అనేక విదేశీ బ్యాంకులు ముందుకు రావడం శుభ పరిణామం. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించిన రుణాల సమీకరణ పై మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఎండి రామకృష్ణారెడ్డి వివిధ బ్యాంకుల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే ఏ.ఐ.ఐ.బి బ్యాంకు ప్రతినిధులతో కార్పొరేషన్ ఎండి సమావేశమయ్యారు. మెట్రో రైల్ ప్రతిపాదిత కారిడారును ఏ.ఐ.ఐ.బి. బ్యాంక్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని ఈ సందర్భంగా అంచనా వేశారు. ఇందులో 6,100 కోట్ల రూపాయలు విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సమీకరించాలని ప్రాథమిక అంచనాకు వచ్చారు. అదే విధంగా ఈ మెట్రో రైల్ ప్రాజెక్టుకు కె.ఎఫ్.డబ్ల్యు, ఏ.ఎఫ్.డి, ఎ.డి.బి, ఏ.ఐ.ఐ.బి, జైక, ప్రపంచ బ్యాంకు రుణాలు ఇవ్వడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. ఈ బ్యాంకులన్నింటిలో ఏ బ్యాంకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తుందన్న విషయాన్ని అంచనా వేసుకున్న తర్వాత, ఆయా బ్యాంకుల ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపనుంది. చర్చలు ఫలాప్రదమై, రుణాలు మంజూరు అయితే ఈ ప్రభుత్వ హయాంలోనే మెట్రో రైల్ పట్టాలు ఎక్కే అవకాశాలు ఉన్నాయి.

# అనుమతి లేకున్నా.... అదనపు అంతస్తులు



- కమిషనర్ లేకపోవడంతో టౌన్ ప్లానింగ్‌లో పెరిగిన 'దందా'
- లలితా నగర్‌లో అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసిపి
- జోన్ 3లో యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

**విశాఖపట్నం, మేజర్ న్యూస్:** జీవీఎంసీ కి కమిషనర్ లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలను తుంగలోతొక్కి కాసుల వేటలో తల మునకలై ఉన్నారు టౌన్ ప్లానింగ్ సిబ్బంది. అధికారులు అండతో నగరంలో అక్రమ నిర్మాణాలకు మరింత ఊతమిస్తున్నారు. కొత్త కమిషనర్ వచ్చేలోగా అక్రమ నిర్మాణాలు పూర్తి చేసుకుంటే... అవన్నీ సక్రమమే అని సర్టిఫికెట్ ఇస్తాం అంటూ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలకు ప్రోత్సాహం అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులే భుజంతట్టి ప్రోత్సహిస్తే ఇక బిల్డర్లు ఊరుకుంటారా? వారిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ (తరువాయి 2వ పేజీలో)

## మంత్రి లోకేష్‌ను కలిసిన మేయర్ పీలా



**విశాఖపట్నం, మే 14, మేజర్ న్యూస్:** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కు నూతనంగా ఎన్నికైన మేయర్ పీలా శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖా మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను, అలాగే హిందూపురం శాసనసభ్యులు, సినీ నటులు నందమూరి బాలకృష్ణను బుధవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని మేయర్ మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు నూతనంగా ఎన్నికైన సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావును అభినందిస్తూ శు భాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి నేపథ్యంలో మహా విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు జీవీఎంసీ లో సుపరిపాలనను సాగిస్తూ విశాఖ నగర ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలు, అందించవలసిన సంక్షేమ కార్యక్రమాలు పై ప్రత్యేక దృష్టి సారించి నగర అభివృద్ధికి కృషి చేయాలని మేయర్ కు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడిపి అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ నగర జనసేన అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఉత్తరాంధ్ర తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దామచర్ల సత్య, ఏ పీ యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, విఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పట్టాభిరామ్, 69 వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిడిఎంఏ జూమ్ ద్వారా వర్క్ షాప్ నిర్వహణ




**విశాఖపట్నం, మే 14, మేజర్ న్యూస్:** జీవీఎంసీ వ్యర్థాల తరలింపు వాహనాలు అవసర నిమిత్తం నిర్ణయించుటకు సి డి ఎం ఏ పి. సంపత్ కుమార్ తో చర్చించడమైనదని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ తెలిపారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీలు, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీల అధికారులతో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్ అమరావతి నుండి జూమ్ యాప్ ద్వారా అవసరమగు చెత్త తరలించే వాహనాలపై వర్క్ షాప్ నిర్వహించారని ప్రధాన వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో నిత్యం నూరు శాతం చెత్త సేకరణ, తరలించుటకు అవసరమగు వాహనాల వివరాలపై సి డి ఎం ఏ తో చర్చించడం జరిగిందని, అవసరమగు చెత్త తరలింపు వాహనాలను జీవీఎంసీకి కల్పించవలసిందిగా కోరడమైనదని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి తెలిపారు. ఈ జూమ్ మీటింగ్ లో పర్యవేక్షక ఇంజినీర్ జి. గోవిందరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ ఏ. రత్నాకర్ రెడ్డి, ప్రధాన వెటరినరీ అధికారి మరియు సహాయక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ ఎన్. కిషోర్, ఇతర సహాయక ఆరోగ్య వైద్యాధికారులు బి. ప్రసాద రావు, డాక్టర్ జె. కృష్ణంరాజు, డాక్టర్ ఏ. సునీల్ కుమార్, డాక్టర్ బి. అప్పల రాజు, శానిటరీ పర్యవేక్షకులు కె. కృష్ణ కుమార్, ఎన్. శ్రీనివాస రాజు, ఎస్. జనార్ధన రావు, కె.వి.ఎన్. శర్మ తదితరులు పాల్గొన్నారు.

## 8వ జోన్‌లో తాగునీటికి అంతరాయం



**విశాఖపట్నం, మే 14, మేజర్ న్యూస్:** మహా విశాఖ నగరపాలక సంస్థ, 8వ జోన్ పరిధిలో పలు ప్రాంతాలకు ఈనెల 16, 17 తేదీలలో తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచి నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. విశాఖపట్నం ప్రధాన వనరులైన తాటిపూడి మంచినీటి సరఫరా చేయు పథకము 900 ఎంఎం వ్యాసము గల ఎంఎస్ పంపింగ్ పైప్ లైను రాయ్ పూర్ నుండి సబ్బవరం నేషనల్ హైవే నిర్మాణ పనులు భాగంగా మరియు అమృత్ -2.0, 24/7 వాటర్ సప్లై సిస్టం నెట్ వర్క్ అభివృద్ధిలో భాగముగా పాపయ్య రాజుపాలెం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతములలో వాటర్ ఫ్లో మీటర్స్ అమర్చుట కొరకు 24 గంటలు తాటిపూడి ప్రధాన పైపు లైన్ నిలుపుదల చేయడమవుతుందని తెలిపారు. ఉత్తరాపల్లి బెలన్సింగ్ రిసర్వాయర్ సమీపంలో తాటిపూడి 900 ఎంఎం వ్యాసము గల ఎంఎస్ పంపింగ్ పైప్ లైన్ రీరూటింగ్ పనులు చేయు నిమిత్తం శుక్రవారం ఉదయం 11.30 గంటలు నుండి శనివారం ఉదయం 11:30 వరకు అనగా 24 గంటలు సమయము మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందన్నారు. తాటిపూడి ప్రధాన పైప్ లైన్ పైన ఉన్న బల్క్ ఇండస్ట్రీస్ వినియోగదారులు కు మరియు జోన్-8 పరిధిలో ఉన్న వార్డ్-93 నుంచి వార్డ్-98లో ఉన్న సాయి దుర్గా నగర్, దుర్గా నగర్, కృష్ణా నగర్. అప్పల నరసింహం కాలనీ, వెంకట సాయి నగర్, బంట కాలనీ, రవి నగర్, లక్ష్మీపురం, పోర్ట్ కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్ బి కాలనీ, గోకుల్దాంకాలనీ, రెల్లివీది, కృష్ణరాయపురం, గొల్లివిల్లివాని పాలెం, ఎల్ఐసి కాలనీ, సుజాత నగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీది, జెడ్పీ హెచ్ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతి నగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, ప్రశాంతి నగర్, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడివివరం, ఎస్సీ కాలనీ, పాత అడివివరం, అడివివరం, మొదలగు ప్రాంతములలో మంచి నీటి సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. పైన ఉదహరించిన ప్రాంతములలో ట్యాంకర్ ద్వారా మంచి నీటి సరఫరా చేయబడుతుందని కార్యనిర్వహక ఇంజనీరు తెలియజేశారు.

(మొదటి పేజీ తరువాయి)

## దోమలపై దండయాత్ర

నగరంలో ప్రత్యేకంగా మస్కిటో ట్రాపర్ మెషిన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇవి మెషిన్‌కు 500 మీటర్ల దూరంలో ఉన్న దోమను ఇట్టే ఆకర్షిస్తూ మట్టుబెడుతుంది. అలాగే ఆయా ప్రాంతాల్లో ఏయే రోగకారిక దోమలు ఎక్కువగా ఉన్నాయన్న విషయాన్ని గుర్తించే పరిజ్ఞానం కూడా ఈ మెషిన్‌లో ఉంటుంది. తద్వారా వాటి నియంత్రణకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

### ఇలా పని చేస్తుంది..

సాధారణంగా దోమలు మనుషుల శ్వాస, శరీర వేడి, వాసనలను పసిగట్టి కుడుతాయి. ఇదే సిద్ధాంతంతో ఈ ట్రాపర్ మెషిన్ పనిచేస్తుంది. యంత్రంలో ఉండే యూవీ కిరాణాలతో పాటు కార్బన్ డయాక్సైడ్ విడుదలై, అనంతరం 39-40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉద్భవిస్తుంది. మనిషి శరీర వాసన కలిగించేలా మిషన్లలో టెక్నాలజీని వినియోగించి 500 మీటర్ల దూరంలో ఉండగానే దోమలను ఆకర్శిస్తుంది. వలలో చిక్కిన దోమలు లోపల ఫ్యాన్ తిరగగానే ఎయిర్ బ్యాగ్‌లోకి వెళ్లి చనిపోతాయి. వీటి ద్వారా నగరంలో ఏయే పాంతాల్లో దోమలు అధికంగా ఉన్నాయి? ఏ రకం దోమల వల్ల ఎలాంటి వ్యాధులు వస్తాయి.. అనే వివరాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. క్యాచ్, కౌంట్, క్లాసిఫై అనే మూడు పనులను ఈ పరికరం చేసింది. మెషీన్‌లోని సువాసనలతో కూడిన లిక్విడ్, సెన్సర్ల వల్ల దోమలు దీంట్లోకి వస్తాయి. దీంతో వాటిలో ఉన్న దోమలను వర్గీకరించి.. వ్యాధులనుకలిగించే దోమలు ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయో తెలుకునే అవకాశం ఉంటుంది. నిరోధక చర్యలు చేపట్టాక ఏ మేరకు దోమలు తగ్గాయో కూడా తెలుసుకోవచ్చు.

### వారంలో అధ్యయనానికి అధికారులు

ప్రస్తుతం హైదరాబాద్, తిరువనంతపురంలలో ఈ మస్కిటో ట్రాప్ మెషిన్ ప్రాజెక్టులు అమలవుతున్నాయి. దీంతో వాటి పనితీరును స్వయంగా పరిశీలించేందుకు అధికారులు ఆయా జిల్లాలకు వెళ్లి మెషిన్ పనితీరును అధ్యయనం చేయనున్నారు. వాటి ద్వారా సత్ఫలితాలు వస్తాయని నిర్ధారణైతే నగరంలో 120 వరకు ట్రాప్ మెషిన్లు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంపై మస్కిటో సంస్థతో అధికారులు సంప్రదింపులు జరిపారు. సదరు సంస్థ కూడా సమగ్ర ప్రాజెక్టు నివేదికను అధికారులకు అందజేసింది. తొలి దశలో పైలెట్ ప్రాజెక్టుగా జోన్%-%4, జోన్%-%5లలో వీటిని ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నారు. వాటి ఫలితాలు ఆధారంగా నగరమంతా విస్తరించాలని చూస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తంగా రూ.1.5 కోట్లు ఖర్చవుతుందని సదరు సంస్థ ఇచ్చిన నివేదికలో స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ వస్తే.. సదరు సంస్థ నగరంలో అన్ని వార్డుల్లోను 120 మస్కిటో ట్రాప్ మెషిన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే ప్రత్యేక సాఫ్ట్‌వేర్, ఇతర సాంకేతికత ఆధారంగా ఏయే ప్రాంతాల్లో ఎటువంటి దోమలు ఉన్నాయన్న విషయాన్ని సంస్థ సిబ్బంది వర్గీకరించి అధికారులకు నివేదిక అందించనున్నారు. తద్వారా నగరంలో దోమల నివారణ చర్యలను సులభంగా చేపట్టే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

### జూన్ 1 నుంచి ప్రత్యేక డ్రైవ్

నగర ప్రజలకు దోమల నివారణపై అవగాహన కలిగించేందుకు అధికారులు జూన్1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు దోమల వ్యాప్తి చెందకుండా చేపట్టాల్సిన చర్యలను వివరించేందుకు ప్రత్యేకంగా 400 మంది సిబ్బందిని కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించనున్నారు. వీరికి రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కొక్కరు రోజు 100 ఇళ్లను కవర్ చేసి దోమల వల్ల కలిగే నష్టాలను వివరించనున్నారు. వీరికి ప్రతి నెలా రూ.15 వేలు వేతనంగా అందించనున్నారు.

## అదనపు అంతస్తులు

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగించుకుంటూ ముందుకు పోతున్నారు. జోన్ 3లో లెక్కకు మించిన అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా, సంబంధిత టౌన్ ప్లానింగ్ ఏసిపి తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు అన్న బలమైన ఆరోపణలు ఉన్నాయి. ఆయన, సిబ్బంది నిర్లక్ష్య మో.. ఆమోదమో తెలియదు కానీ.. 26వ వార్డు లలిత నగర్ లో ఒక భవనంలో అనుమతి లేకుండా అదనపు అంతస్తు నిర్మిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. అక్కయ్యపాలెం లలిత నగర్ లో ఒక బ్యాకరీకి ఎదురుగా, సర్వే నెంబర్ 289లో ఒక బిల్డింగ్ నిర్మిస్తున్నారు. బి.ఏ.నెంబర్ 1086/ 4124/ బి/ %ఓ%3/ ఎల్.ఏ.ఆర్ 2024 నెంబర్ తో జి ప్లస్ టు భవనానికి అనుమతి ఇచ్చారు. కానీ సదరు బిల్డర్ జి ప్లస్ త్రీ భవనాన్ని నిర్మిస్తున్నాడు. అంతే కాదు, ఈ భవన సెల్లార్లో పార్కింగ్ కు ఖాళీ స్థలం ఉంచాలి. అలా చేయకుండా అక్కడ కూడా గదులు నిర్మిస్తున్న వైనం దర్శనమిస్తోంది. ఇది టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. దీనికి సంబంధించి టౌన్ ప్లానింగ్ సెక్రటరీని వివరణ కోరగా అనుమతి లేని కట్టడాల పై అధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పుకొచ్చారు. ఈ విషయమే ఏసిపి మధుసూదన్ రావు ను వివరణ కోరినప్పటికీ ఎటువంటి సమాధానం చెప్పకుండా వ్యవహరిస్తున్నారు. అదనపు అంతస్తు నిర్మిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్తే చూద్దాం.. చేద్దాం.. అంటూ తప్పించుకుంటున్నారు. బిల్డర్ ని వివరణ కోరగా తాను అధికారులతో మాట్లాడుకుంటాను అంటూ జవాబు చెబుతున్నారు.

జోన్- 3లో జరిగే అక్రమ నిర్మాణాలలో ఈ భవనం ఒక మచ్చుతునక మాత్రమే. ఇటువంటి వ్యవహారాలు చాలా జరుగుతున్నాయి. కమిషనర్ లేకపోవడంతో ఎవరు ఇష్టరాజ్యంగా వారు వ్యవహరిస్తున్నారు అనడానికి ఇటువంటి నిదర్శనాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా ఇంచార్జ్ కమిషనర్ అయిన జిల్లా కలెక్టర్ ఇటువంటి నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కిషోరి వికాసం సమ్మర్ క్యాంప్‌లో పలు కార్యక్రమాలు

**గరుగుబిల్లి,మే 14,మేజర్ న్యూస్:** కిశోరి వికాసం కార్యక్రమంలో భాగముగా వచ్చే నెల 10వ తేదీ వరకు ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించ డం జరుగుతుందని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి అన్నారు. కిషోరి వికాసం సమ్మర్ క్యాంపు కార్యక్రమం లో భాగంగా బుధవారం గొట్టివలస, పెదగుడబ, తదితర గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో కిషోరి బాలికల కు పలు అంశాల గురించి వైద్య సిబ్బంది తెలియజేశారు.అనంతరం జరిగిన సమావేశంలో పి వో సుగుణ కుమారి మాట్లాడుతూ వచ్చేనెల 10వ తేదీ వరకు కిషోరి వికాసం కార్య క్రమంలో కిషోరి బాలికలకు పలు అంశాల గురించి తెలియ జేయ డం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా 11 సంవత్సరాల నుంచి 18 సంవత్స రాలు బాలికల కు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగు పరచడమే ఈకార్య క్రమము యొక్క ముఖ్య ఉద్దేశం అని



తెలిపారు. కిషోరి వికా సం కార్య క్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, అదే విధంగా ఉజ్వల ఆరోగ్యకరమైన సాధికార దిశగా వేసే అడుగులకు చేయూతను ఇద్దామని పేర్కొన్నారు. రక్తహీనత నివారణే ధ్యేయంగా గర్భిణీలు బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారమును పంపిణీ చేయడం జరుగుతుంద న్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు చింతాడ గౌరమ్మ, పెద్దింటి మీనాక్షి, చింతల పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.




## మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవం

**– నూతన కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి**



**దేవరాపల్లి, మే 14, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బుధవారం రైవాడ అతిథి గృహం వద్ద టిడిపి నియోజకవర్గ పరిశీలకులు ఏసుదాసు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమక్షంలో మండల అధ్యక్ష, కార్యదర్శ ఎన్నికలు తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఎన్నిక అనివార్యమైంది. అధ్యక్ష పదవికి ఇద్దరు, కార్యదర్శి పదవికి ముగ్గురు చొప్పున పోటీ పడడంతో గ్రామాలలో ఎన్నికైన గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నుంచి రహస్యంగా అభిప్రాయ సేకరణ చేసి నూతన అధ్యక్ష, కార్యదర్శులను పార్టీ పరిశీలకులు ప్రకటించారు. మండల పార్టీ అధ్యక్షులుగా పెద్దాడ వెంకటరమణ (ఏ. కొత్తపల్లి), ప్రధాన కార్యదర్శిగా దొగ్గ దేముడు నాయుడు (కలిగొట్ల) ఎన్నికయ్యారు. ఈ అధ్యక్ష ఎన్నికకు గతంలో పార్టీ అధ్యక్షుడుగా పని చేసిన చిటిమిరెడ్డి సూర్యనారాయణ, ఏ. కొత్తపల్లికి చెందిన పెద్దాడ వెంకటరమణ మండల అధ్యక్ష పదవికి పోటీపడ్డారు. అనంతరం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడు నాయుడును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా పార్టీకి సేవలందించిన చిటిమిరెడ్డి సూర్యనారాయణకు జిల్లా (లేక) రాష్ట్రస్థాయి కమిటీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, శరకాన సూర్యనారాయణ, దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, కొమర బాబురావు, చల్లా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

## మునగపాకలో జన వానికి విశేష స్పందన



**మునగపాక, మే 15, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక జనసేనపార్టీ.కార్యాలయంలో.శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆదేశాలు మేరకు బుధవారం మునగపాక జనసేన పార్టీ ఆఫీస్ లో నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి 53 దరఖాస్తులు వచ్చాయని అన్నారుఅయితే జనవాణి కార్యక్రమంలో వ్యక్తిగతంగా కంటే సామాజికంగా ఎక్కువ వినతి పత్రాలు రావడం విశేషం, ఈ అర్జీలు స్వయంగా ఎంపీడీవో ఉషారాణి అందుకొని పరిష్కార మార్గాన్ని కూడా అక్కడే మండలంలో ఉన్న.అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారం చేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో వీరభద్రరావు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మానస, డిప్యూటీ తాసిల్దార్ వి.శేషు బాబు, మరియు మండల జనసేన నాయకులు టెక్కలి పరుశురాం, మొల్లేటి ఆనంద్ , ఎల్లపు సంతోష్, వీర మహిళ సరోజినీ, సరస్వతి,తదితరులు పాల్గొన్నారు...

## జగనన్న కాలనీల పేరుతో రైతులు దళితులు భూములు దోచేసిన వైసిపి నాయకులు

**– సిఐడి ఎంక్వయిరీ చేయాలని ఆర్డీవోకు వినతిపత్రం**



**నర్సీపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం నియోజకవర్గంలో జగనన్న కాలనీలలో అంతులేని అవినీతి జరిగినట్లు తెలుస్తోంది గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు. రైతులు. దళితులను అడ్డగోలుగా దోపిడీ చేశారు. జగనన్న కాలనీలు నిర్మిస్తున్నట్లు నాయకులకు ముందే తెలియడంతో పేద రైతులు. దళితుల దగ్గర ఉన్న భూములను అతి తక్కువ రేట్లకు ఒప్పందం చేసుకొని రెవెన్యూ అధికారుల అండదండలతో ప్రభుత్వ డబ్బును రైతులు. దళితుల భూములకు రావలసిన సొమ్ములను వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా దోచేశారు . దోపిడీ చేసిన సొమ్ము వైసిపి నాయకులు వాటాల పంచుకున్నట్లు తెలుస్తుంది. ఒక్క వేములపూడిలోనే సుమారు 20 మంది రైతులను మోసగించినట్లు తెలుస్తుంది. రెవిన్యూ అధికారులు కను సన్నల్లోనే ఇదంతా జరిగిందని వారికి అంతా తెలుసని తెలుస్తుంది. జగనన్న కాలనీల భూములపై సిఐడి ఎంక్వయిరీ చేయాలని టిడిపి నాయకులు ఆర్డీవో కు వినతి పత్రం అందజేశారు. అమాయకులైన ప్రజల దగ్గర దోచేసిన భూములను తిరిగి వారికి అప్పగించాలని అన్యాయంగా ప్రజలను మోసం చేసి దోపిడీ చేసిన వారిని వెలుగు తీసి వారి ఆస్తులను జప్తు చేయాలని బాధ్యులైన వారిని సిఐడి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వం కాలంలో జగన్న కాలనీ ఇంటి స్థలాల కోసం సేకరించిన భూముల కొనుగోలు ప్రక్రియపై విచారణ జరిపించాలని టిడిపి మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, అప్పటి ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ తన అనుచరుల ద్వారా నాలుగు మండలాల్లో రైతుల నుండి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి, ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయించి లక్షల రూపాయలు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. అటు ప్రభుత్వాన్ని మోసం చేయడమే కాకుండా రైతులను కూడా మోసం చేశారని దీనిపై ప్రభుత్వం వెంటనే సిఐడి తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇంకా, జగనన్న ఇంటి స్థలాల కోసం భూములు ఇచ్చిన రైతులు ఉన్నట్లయితే, వారు ఆయా మండల రెవెన్యూ కార్యాలయాల్లో లేదా స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ అయ్యన్నపాత్రుడు కు గానీ సమాచారం అందిస్తే, న్యాయం జరగే వరకూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ డబ్బిరు శ్రీకాంత్, నాయకులు రుత్తల కృష్ణ, పైల గోవిందు, పెదిరెడ్ల చింటూ తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు చలిసింగం గ్రామానికి కారు పై చేరుకున్న ఎమ్మెల్యే



**రావికమతం, మే 14, మేజర్‌న్యూస్:** చలి సింగం గ్రామానికి నడుచుకొని మాత్రమే చేరుకునే స్థితి నుంచి కారు తో వెళ్లగల స్థాయికి రహదారి చేరుకుంది. చోడవరం ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ రాజు బుధవారం ఈ గ్రామానికి తన వాహనంపై చేరుకొని గిరిజనులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం కి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ నిర్మించిన గ్రావిటీ నీటి పథకాన్ని ప్రారంభించారు. చీమలపాడు పంచాయతీలో ఉన్న ఈ గ్రామానికి కేవలం కాలినడకన మాత్రమే చేరుకునే మార్గం కొన్ని ఏళ్లుగా ఉంది. ఈ కారణంగా గిరిజనులు పలు ఇక్కట్లకు గురవుతున్నామని గత కొంతకాలంగా అధికారులు ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకుం టున్నారు.. ఈ మేరకు ఈ పంచాయతీలోని షికాయ పాడు నుంచి చలసింగం వరకూ తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ గ్రావిల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీనిని పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే నేరుగా తన వాహనంపై గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం గిరిజనులకు కనీస సౌకర్యాలు కల్పనకు పెద్దపేట వేస్తుందన్నారు. పూర్వకాలం నాటి ఇనప విద్యుత్ స్తంభాలను మార్చాలని, ఉపాధి పనుల కోసం ప్రత్యేకంగా వీఆర్పీని కేటాయించాలని , తరచూ జ్వరాలుతో బాధపడుతున్నామని గిరిజనులు ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్నారు. దీనికి స్పందించిన తక్షణం సిమెంట్ విద్యుత్ స్తంభాలు మార్పు చేయాలని, విఆర్పిని ఈ గ్రామానికి ప్రత్యేకంగా నియమించాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని విద్యుత్, డుమా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఎమ్మెల్యే రాజు గ్రామం నుంచి ఫోన్లో మాట్లాడారు. బంటు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. నర్సీపట్నం మండలం అమలాపురం గ్రామానికి చెందిన శెట్టి స్వామినాయుడుకు రూ.56,043/- విలువైన చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి అనేక పేద కుటుంబాలకు ఆపద సమయంలో ఆశ్రయంగా మారిందన్నారు. గత పది నెలల్లో నియోజకవర్గం లోని 25 మందికి పైగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండల పార్టీఅధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



## మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**– శక్తి యాప్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి**

**– పోలీసు విధుల్లో బాధ్యతగా నిర్వహించాలని సూచనలు**



**నర్సీపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని శుభ్రత, నిర్వహణ, రికార్డుల సంరక్షణను సమీక్షించారు. అన్ని రికార్డులు సమయానికి నవీకరించాలనే సూచనలతో పాటు, నేర నివారణపై మరింత దృష్టి పెట్టాలన్నారు. స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంటున్న నేరాల స్వరూపం గురించి అధికారుల నుంచి సమాచారం తీసుకున్న ఎస్పీ , నేర చరిత్ర గలవారు మరియు అనుమానితులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే కౌన్సిలింగ్ కూడా ఇవ్వాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాపై గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులకు, మహిళలకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ మరియు మహిళా చట్టాలపై శక్తి యాప్ ప్రాముఖ్యతను తెలిపి ప్రతి ఒక్కరూ యాప్ ను డౌన్లోడ్ చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. రహదారి భద్రతా ప్రమాణాలు, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అనేది నేర నియంత్రణలో కీలకమని, దీనిపై ప్రజలలో అవగాహన పెంచాలని స్పష్టం చేశారు. తనిఖీ అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ మాకు వారి పాలెం పోలీస్ సిబ్బంది సేవలను అభినందించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సహాయాన్ని అందించేందుకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఆరోగ్య మిత్ర కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం



**బొబ్బిలి,మే 14: మేజర్ న్యూస్:**బొబ్బిలి సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్యమిత్రగా పని చేస్తున్న శీర గౌరినాయుడు విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో ఆటోలో జారిపడి గత నెలలో మృతి చెందారు. ఆరోగ్యమిత్ర కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ఉమ్మడి విజయనగరం జిల్లా ఆరోగ్యశ్రీ యూనియన్ ఆధ్వర్యంలో సిబ్బంది నుండి 71,000 రూపాయలను సేకరించి పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ డ్ డిపాజిట్ చేసి, గౌరినాయుడు భార్య సరస్వతికి ఫిక్స్డ్ డిపాజిట్ పుస్తకాన్ని ఆరోగ్యమిత్రలు బుధవారం నాడు పక్కి గ్రామంలో అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ సహ ఉద్యోగిని కోల్పోవడం చాలా బాధగా ఉందని,ఆ కుటుంబానికి అండగా ఉండాలని ఉద్దేశంతో ఆర్థిక సహాయం చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు రాంబాబు, శంకరరావు,విటల్ కుమార్ పాల్గొన్నారు.

## రక్త దాతలే ప్రాణ దాతలు



**బొబ్బిలి, మే 14: మేజర్ న్యూస్:** రక్తదాతలే ప్రాణ దాతలని వారే సమాజంలో నిజమైన హీరోలని రోటరీ జిల్లా చైర్మన్ ఇండియన్ రెడ్ క్రాస్ లైఫ్ టైం సభ్యులు జె సి రాజు అన్నారు. బుధవారం కోమటిపల్లి తాండ్ర పాపారాయ ఇంజనీరింగ్ ప్రాంగణంలో భారతప్రభుత్వం,సీడప్ గ్రామీణ అభివృద్ధి సంస్థ మరియు మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సంయుక్త ఆద్వర్యం నడపబడుతున్న కంప్యూటర్ శిక్షణా కేంద్రం యువతీ, యువకులకు ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సూచనతో రక్త దానం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ నేపథ్యంలో జె సి రాజు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సర్వ్ హుమానిటీ లక్ష్యంతో రెడ్ క్రాస్ సంస్థ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నదని అన్నారు. రక్తం అవసరమైన వ్యక్తికి రక్తదాత రక్తం ఇవ్వటంఒక్కటే మార్గమని , రక్తాన్ని కృత్రిమం గా తయారు చేయలేమని అన్నారు.రక్త ఇవ్వటం ద్వారా ఆ వ్యక్తికి ప్రాణం పోయటమే కాకుండా ఆ కుటుంభం అంతటిని సంతోషంగా ఉండేలా చేస్తాడన్నారు. ఒక రక్త దాత 3 ప్రాణాలు కాపాడతారన్నారు. సమాజంలో నిజ హీరో రక్త దాతే నని అన్నారు. రోటరి క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ మాట్లాడుతూ రక్త ఇవ్వటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ఎలాంటి నీరసం కానీ శక్తిని కోల్పోవడం గాని జరగదని,ఇచ్చిన రక్తం ఒక్కరోజులో సమకూర్చుకోవచ్చని తెలియచేస్తూ రక్తం ఇవ్వటంలో ఉన్న అపోహలను నివృత్తి చేశారు.రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరాలకు హాజరై రక్తాన్ని దానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థమేనేజర్ యెస్.తారక రాజేష్ రోటరీ యూత్ చైర్ డేవిడ్ జె విక్టర్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదుకు ఎన్రోల్మెంట్ డ్రైవ్



**రామభద్రపురం, మే 14 (మేజర్ న్యూస్)** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమల ప్రసాద్ తెలిపారు. ఇందులో భా గంగా బుధవారం స్థానిక శ్రీరామ్ నగర్ కాలనీలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు మౌళిక సౌకర్యాలు అందిసు న్నామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లతో పెద్ద ఎత్తున ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ప్రచారం చేస్తున్నామని అన్నారు. ఇటీవల జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అధిక మార్కులు సాధించారని తెలిపారు. వీటిపై ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు ఒకటో తరగతి ప్రవేశాలకు సుమారు 300 మందిని గుర్తించి రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడిలో చేర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్నగర్ కాలనీ ప్రధానోపాధ్యాయులు శివరాంనాయుడు, సీఆర్పీ రవికుమార్ పాల్గొన్నారు

## భవిష్యత్తులో మంచి డ్రైవర్స్‌గా గుర్తింపు తెచ్చుకోవాలి



**విజయనగరం టౌన్, మే 14, మేజర్ న్యూస్:** భవిష్యత్తులో మంచి డ్రైవర్సగా గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి సి. హెచ్. అప్పలనారాయణ అన్నారు. బుధవారం స్థానిక విజయనగరం ఆర్టిసి గ్యారేజ్ వద్ద ఏపీఎస్ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో 21 వ బ్యాచ్ లో శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రైవర్లకు డ్రైవింగ్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేసారు. డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మరో వారం రోజుల్లో 22 వ నూతన బ్యాచ్ ప్రారంభవుతుందని తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సంవత్సరాలు నిండినవారు అర్హులని తెలిపారు. మొత్తం శిక్షణ 40 రోజుల పాటు వుంటుందని ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డ్రైవింగ్ స్కూల్ ఇన్స్పెక్టర్ డీఎన్ రాజు 7382924030, 98666 49336ల్లో సంప్రదించాలన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు

### బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

**రామభద్రపురం, మే 14 (మేజర్ న్యూస్)** శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్ ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణాపై ఎక్కువగా దృష్టిసారించామని, వాటి నిరోధానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిసవ్వడం వలన కుటుంబాలు నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే మహిళలపై దాడులు, బాల్య వివాహాలపై కూడా నిఘా ఏర్పాటు చేశామని, వీటిని ప్రోత్సహించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ప్రమాదాలు జరిగినచోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో బొబ్బిలి రూరల్ సీఐ కే.నారాయణరావు పాల్గొన్నారు.




## జిల్లా వ్యాప్తంగా లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలి

### కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



**విజయనగరం, మే 14: మేజర్ న్యూస్:** వేసవిని దృష్టిలో ఉంచుకొని ఈనెల 17వ తేదీన మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఉష్ణతాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మండల, జిల్లా అధికారులను ఆదేశించారు. వచ్చే నెల రోజులపాటు వడగాల్పులు వీచే అవకాశం ఉన్నందున జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు పట్టణాల్లో వేసవి నుంచి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని బీట్ ద హిట్ పేరుతో నిర్వహిస్తోందని దీనిలో భాగంగా జిల్లాలో అన్ని గ్రామాలు పట్టణాల్లో ముఖ్య ప్రదేశాలు, జన సమూహాలు ఉండే ప్రదేశాలలో తాగునీటి సౌకర్యం కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. బస్సులు నిలిపే ప్రదేశాలు మార్కెట్లు ముఖ్య కూడళ్ళలో, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో నీడను కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని మండల, జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించే ప్రజలకు, కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి తాగునీటి సౌకర్యం సంవత్సరం పొడవునా కల్పించేలా శాశ్వత చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యాలయాలు సందర్శించే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం కనీస బాధ్యతగా భావించి మానవతా దృక్పథంతో ఈ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా వచ్చే మూడో శనివారం నాడు స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నీడనిచ్చే లక్ష మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికి అవసరమైన మొక్కలను జిల్లా అటవీ శాఖ అధికారి సరఫరా చేయాలని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక డ్రైవ్ గా చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు సంస్థలు బహిరంగ ప్రదేశాలు రోడ్ల పక్కన మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాల్లో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని మొక్కుబడిగా చేయకుండా వీటి ఫలితాలు ప్రజలకు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో వృద్ధులు పిల్లలు వంటి వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా గ్రామాలు పట్టణాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖకు ఆదేశించారు.

వేసవిలో డీహైడ్రేషన్ కు గురయ్యే అవకాశం ఉన్నందున తగిన సంఖ్యలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేయాలన్నారు. వేసవిలో చెరువులు కుంటల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున పశువులు ఇతర జంతుజాలానికి అవసరమైన త్రాగునీటిని సరఫరా చేసేందుకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో వర్షపు నీటి సంరక్షణ కోసం కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, ఇళ్లలో ఇంకుడు గుంతలు తవ్వించేలా అవగాహన కలిగించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు చేపట్టిన ఉద్యమాన్ని కొనసాగించేలా ప్రభుత్వ అధికారులు ఉద్యోగులు చొరవ చూపి తాము ముందుగా నిషేధాన్ని అమలు చేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని కోరారు. గ్రామ ప్రజల తలసరి ఆదాయాన్ని వివిధ రంగాల ద్వారా గ్రామం నుంచి లభించే ఆదాయం తదితర సమాచారంతో అన్ని గ్రామ సచివాలయంల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆన్లైన్ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి ముఖ్య ప్రణాళిక అధికారి పి బాలాజీ జిల్లా పరిషత్ సీఈవో బీవీ సత్యనారాయణ జిల్లా పంచాయతీ అధికారి టి వెంకటేశ్వరరావు మున్సిపల్ కమిషనర్ పి నల్లనయ్య, జల్ అన్ని శాఖల జిల్లా అధికారులు మండల ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు తహసిల్దార్లు పాల్గొన్నారు.

## పాత చంపావతి నది వంతెనకు మహర్దశ



**పూసపాటిరేగ, మే 14, మేజర్ న్యూస్ :** మండలంలోని నాతో వలస సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న పాత వంతెన రూపురేఖలు మారిపోనున్నాయి.అందులో భాగంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు కొత్త వంతెన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.గత బిజెపి వాజ్పాయ్ ప్రభుత్వంలో మొదటిసారిగా జాతీయ రహదారుల విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టగా మహార్య సంస్థ ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టగా, చంపావతి నదిపై ఉన్న పాత వంతెన నిర్మాణాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త వంతెన నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది. కానీ పాత వంతెనను పనులు చేపట్టకుండానే రహదారులను విస్తరించారు తప్ప వంతెన నిర్మాణాన్ని అభివృద్ధి చేయలేదు. దీనితో అప్పటి వందేళ్ళ నాటి పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. ఇదే వంతను వద్దకు వచ్చేసరికి వాహనాలు నదిలోకి బోల్తాలు పడడంతో ఎంతోమంది వాహనదారుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వంతెన కూడా ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీనితో ఎన్ హెచ్ ఎ ఐ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న వంతెనను తొలగించి దాని స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టడంపై పలు వాహనదారులు హర్షాత్రేఖాలను వ్యక్తం చేస్తున్నారు.




## నారాయణపురం ఆనకట్ట కాలువ పనులకు నిధులు మంజూరు



**ఆమదాలవలస, మే 14, మేజర్‌న్యూస్:** నారాయణపురం ఆనకట్ట కుడి ప్రధాన కాలువలో పనులకు రూ.34.63 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ బుధవారం ప్రకటనలో తెలియజేశారు. నారాయణపురం కుడి ప్రధాన కాలువలో 1.2 కిలోమీటర్ల వరకు పేరుకుపోయిన సిల్క్ తొలగించేందుకు, అలాగే 6.3 కిలోమీటర్ల నుండి 12.75 కిలోమీటర్ల వరకు 37.70 నుంచి 44.60 నీటిపారుదలకు అనువుగా టి పి ఆర్ నారాయణపురం ప్రాజెక్ట్ పనులు జరిపించేందుకు, రైట్ మెయిన్ కెనాల్ ప్రధాన ఛానల్‌లో సాగునీరు ప్రవహించేందుకు వీలుగా పనులు జరిపించేందుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈపిఆర్ నారాయణపురం ఆనకట్ట నుంచి సుమారు 38 కిలోమీటర్లు ఇప్పటి వరకు నీటి ప్రవాహానికి అంతరాయం కలుగుకుండా ఐదు చోట్ల పనులు నిర్వహించేందుకు రూ.34.63 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు.

## త్రాగునీటి కష్టాలు తీరనున్న వేళ..

- నేటి నుండి పట్టణమంతటా త్రాగునీటి సరఫరా..



**నరసన్నపేట, మే 14, మేజర్‌న్యూస్:** నరసన్నపేట పట్టణంలోని అన్ని ప్రాంతాలకు గురువారం ఉదయం నుండి సురక్షిత మంచినీరు సరఫరాను ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వహిస్తామని మేజర్ పంచాయతీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి పల్లి ద్రాక్షయిణి తెలియజేశారు. గత కొద్దిరోజులుగా పట్టణంలో త్రాగునీటి సమస్యపై గ్రామ పంచాయతీ సిబ్బంది తమదైన శైలిలో నిర్వహణ నిర్వహించారు. అహర్నిశలు కృషిచేసి పాడైన మోటర్లు బాగు చేయడం, అనంతరము త్రాగునీటిని అందించేందుకు చేసే ప్రయత్నంలో గుండివిల్లి పేట వద్ద త్రాగునీటి పైప్లైన్ మరమ్మతుల గురిఅవ్వడంతో సరఫరా లో ఇబ్బందులు తలెత్తడం పాఠకులకు విధితమే . గ్రామపంచాయతీ సిబ్బంది పైప్లైన్ మరమ్మతులు నిర్వహించి, త్రాగునీటి సరఫరాకు మార్గం సుగమం చేశారు. దేవాది పంప్ హౌస్ నుండి నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయంలోని అండర్ గ్రౌండ్ ట్యాంకులకు త్రాగునీరు చేరుతుంది. గురువారం నుండి పట్టణంలోని అన్ని ప్రాంతాలకు త్రాగునీటి అందించేందుకు చర్యలు చేపట్టామని ఈవో తెలియజేశారు. పట్టణ ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు గ్రామపంచాయతీ చేపట్టిన చర్యలకు కృతజ్ఞతలు.

## చంద్రప్రభ వాహనంపై శ్రీనివాసులు..



**నరసన్నపేట, మే 14, మేజర్‌న్యూస్:** నరసన్నపేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భముగా బుధవారం స్వామివారు చంద్రప్రభ వాహనంపై ఊరేగారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి సత్యసాయి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

# అచ్చన్న పై విజ్ఞతలేని రాతలు..

- పేటలో ఆక్రమణలపై బహిరంగ చర్చకు సిద్ధం.
- బిల్డింగ్ సొసైటీ బైలా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు.
- చిల్డ్రన్ పార్క్ స్థలాన్ని కబ్జా ప్రయత్నించిన వారిపై కేసు.
- ప్రెస్ మీట్ లో టిడిపి నేతలు..




నరసన్నపేట, మే 14, మేజర్‌న్యూస్: నరసన్నపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఒక దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని తీవ్రంగా ఖండించిన పట్టణ టిడిపి నేతలు. బిల్డింగ్ సొసైటీ స్థలంలో అపార్ట్మెంట్ నిర్మాణాలు చేపట్టరాదని, అచ్చన్న పేరుతో బెదిరిస్తున్నారన్న వ్యాఖ్యలపై టిడిపి నేతలు తీవ్రంగా విరుచుకు పడ్డారు. మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు మాట్లాడుతూ చెన్నై బిల్డింగ్ సొసైటీ అనుమతుల ప్రకారము కేటాయించిన రిజర్వ్ స్థలాలు, ఎలా చేతులు మారాయో, వాటిలో ఎటువంటి నిర్మాణాలు జరిగాయో స్వయంగా పరిశీలించేందుకు వైసిపి నేతలు రావాలని అన్నారు. అపార్ట్మెంట్ నిర్మించరాదని అపార్ట్మెంట్లో నివసిస్తున్న వారు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత నిర్మాణాలు చేపడుతున్న స్థలాన్ని 1991 లోనే గొండు రామన్న కొనుక్కున్నారని, రిజిస్ట్రేషన్ 2018 లో జరిగిందన్నారు. పంచాయతీ, సుడా అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణంపై నిరాధారణ ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. ఈ నిర్మాణాలలో ఎటువంటి సంబంధం లేని రాష్ట్రంలోనే నెంబర్ 3గా ఉన్న అచ్చం నాయుడు పేరు ప్రస్తావించడం అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నంతో వైసీపీ నాయకులు, వాళ్ల పేపరు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు విశ్వసించారన్నారు. ప్రజల విశ్వాసాన్ని ఎన్డీఏ కూటమి నిలబెట్టుకుంటుందని, ప్రస్తుత పాలనలో అన్ని రకాల సదుపాయాలు అందిస్తూ, ఇంకా మెరుగైన సమాజం కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆరోపణలు మాని స్వయం పరిశీలనకు వైకాపా నేతల సిద్ధం కావాలని చిట్టిబాబు సూచించారు . చిల్డ్రన్ పార్క్ ధ్వంసం చేసిన సిసి ఫుటేజ్ రికార్డులు ఉన్నాయని, వారిపై న్యాయపోరాటం చేస్తామని, ప్రభుత్వ స్థలాలను కబ్జాకు ప్రయత్నించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తామని చిట్టిబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర వాణిజ్య విభాగ టీడీపీ కార్యదర్శి జామి వెంకట్రావు మాట్లాడుతూ బిల్డింగ్ సొసైటీ అక్రమాలపై ప్రచురితమైన కథనం పూర్తి అవాస్తవమైనదని, రాష్ట్ర మంత్రి అచ్చం నాయుడు పై రాసిన రాతలు విజ్ఞత లేనివని అన్నారు. బిల్డింగ్ సొసైటీ బైలా ప్రకారం అపార్ట్మెంట్ నిర్మాణాలు ఉండకూడదని, అపార్ట్మెంట్లో నిర్మించిన వ్యక్తి అందులో నివాసం ఉన్న వ్యక్తి బైలా మరిచి ఇప్పుడు ఇలా మాట్లాడటం క్షమించరానిది అన్నారు. బిల్డింగ్ సొసైటీ తీర్మానాలు వ్యతిరేకంగా ఇందిరా నగర్ ప్రాంతంలో జరిగిన జరుగుతున్న ఆక్రమణలపై ప్రస్తుత పరిస్థితులపై ముఖాముఖి చర్చకు సిద్ధమన్నారు. వైసీపీ వాళ్ల తప్పుడు ఆరోపణలు మానుకోవాలని,నరసన్నపేట పట్టణంలో చెరువులు పోరంబోకు స్థలాలు ఆక్రమణలతో, కబ్జాలు వైసీపీ నాయకుల ఆధీనంలోని ఉన్నాయని, బహిరంగ చర్చకు నాడు పిలిచాము నేడు పిలుస్తున్నాము. ఇప్పటికైనా చర్చలకు సిద్ధమే అని, వైసీపీ నాయకుల తప్పుడు ప్రచారాలపై పట్టణ తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని వ్యాఖ్యానించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేపర్లో కోట్ల విలువైన భూములు కబ్జా కుట్ర అని రాయడం అవివేకం అన్నారు. కొనుగోలు చేసిన స్థలంలో అన్ని రకాల అనుమతులతో నిర్మాణాలు చేపట్టడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు.నిబంధనలకు విరుద్ధంగా బిల్డింగ్ సొసైటీ స్థలాలలో ప్రస్తుతం 10 అపార్ట్మెంట్లో ఉన్నాయని, వాటికి లేని అడ్డంకులు నేటి నిర్మాణానికి ఎందుకు వర్తిస్తాయి అని ప్రశ్నించారు.ఎన్ఓసి ఇవ్వలేదని బిల్డింగ్ నిర్మాణాలు ఆపారని, ఎన్ఓసీ తెచ్చుకుని నిర్మాణం చేపడతామన్నారు.అచ్చంనాయుడు పేరుతో బెదిరించారని అనడం చిన్నపిల్లల చేష్టలా ఉందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పీస కృష్ణ, కింజరాపు రామారావు, బలగ ప్రహర్ష, వార్డు సభ్యులు బోయిన సతీష్, బతకల గోపి పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు ఏవి?



**మెలియాపుట్టి, మే 14, మేజర్‌న్యూస్:** ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు ప్రభుత్వం ఏర్పాటు అయిన తక్షణమే ప్రజలకు పథకాలు ప్రజలకు అందజేస్తామని 11 నెలలు దాటిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయడం లేదని రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మెలియాపుట్టి మండలం లో పెద్ద పద్మాపురం గ్రామంలో శుభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆచరణ కానీ హామీలు ఇచ్చి ప్రజలకు మరోసారి మోసం చేశారని అన్నారు. ప్రజలు నమ్మి కూటమి ప్రభుత్వం కు గెలిపిస్తే ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు.వెంటనే ఇచ్చిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు వైసీపీ నాయకులు ఉర్లాన ఋషి, జె. కన్నబాబు, పాడి అప్పారావు ,బైపోతు తేజ రావు, శ్యాములో తదితరులు పాల్గొన్నారు.నూ

## ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే



**మెలియాపుట్టి, మే 14, మేజర్‌న్యూస్:** మెలియాపుట్టి మండలంలోని గొప్పిలి గ్రామంలో శ్రీ కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో మూడు రోజులు పాటు ఘనముగా నిర్వహించారు..ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం నాయకులతో కలిసి పాల్గొన్నారు.పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సీతారాములవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు తీర్థప్రసాదాలు ఇచ్చి జ్ఞాపికను అందజేశారు.

అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆమెతో పాటు గ్రామ సర్పంచ్ పల్లి జయసుధ యోగి, వైసీపీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, అలికాన మాధవరావు, ఎస్ సుబాష్, గ్రామ కమిటీ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను
# అంకితభావంతో నిర్వహించాలి
### కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, మే 14, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను అంకితభావంతో నిర్వహించాలని, సత్ఫలితాలు వచ్చేలా కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రతి మూడో శనివారం చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నిర్వహణపై బుధవారం సాయంత్రం తన ఛాంబర్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. అజెండా అంశాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని, మెగా క్లీనింగ్ డ్రైవ్ పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని వడగాలులు(బీట్ ద హీట్) నుంచి ప్రజలు ఉపశమనం పొందేలా, పచ్చదనం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అంకితభావం ప్రదర్శించాలని చెప్పారు. కార్మికులు, వీధి వ్యాపరులు, చిన్న పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పార్కులు, బస్, రైల్వే స్టేషన్లు, వసతి గృహాలు, ఆసుపత్రులు తదితర ప్రాంతాల్లో ఈ నెల మూడో శనివారం స్వచ్ఛందంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ఆసుపత్రులు, విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాలు, ఆసుపత్రుల్లో చేపట్టే కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో, కార్యాలయాల పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించి ఫోటోలు, ఇతర నివేదికలు నివేదించాలని సూచించారు. టెర్రాస్ గార్డెనింగ్, తడిపొడి చెత్త నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అధికారులు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకొని స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి విజయవంతంగా నిర్వహించాలని, అందరినీ భాగస్వామ్యం చేసుకొని ముందుకు సాగాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్లో సీఎంవో నరేష్ కుమార్, డిపివో శ్రీనివాసరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## గరివిడి పశువైద్య కళాశాలను పరిశీలించిన వీసీఐ బృందం



**చీపురుపల్లి మే 14 మేజర్ న్యూస్:** గరివిడి పశువైద్య కళాశాలను న్యూఢిల్లీ కి చెందిన వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం బుధవారం పరిశీలించింది. మూడు రోజులు పాటు నిర్వహించే పరిశీలన లో భాగంగా విచ్చేసిన బృంద సభ్యులైన డాక్టర్ పి.ఎం.లునగారియి, డాక్టర్ అంబికా ప్రసాద్ కె.మహా పత్ర, డాక్టర్ ప్రతిభా జండే లను తిరుపతి పశు వైద్య విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, గరివిడి కళాశాల అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను స్వాగతం పలికారు. కళాశాల నూతన భవన నిర్మాణాలను బృంద సభ్యులు పరిశీలించారు. కాగా విసిఐ బృందం పరిశీలన నేపథ్యంలో కళాశాలకు విసిఐ అనుమతులు లభిస్తాయని విద్యార్థులు ఆశిస్తున్నారు.

# యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: మురళి



**గరుగుబిల్లి ,మే 14 ,మేజర్ న్యూస్:** తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయ ప్రాంగణంలో గరుగుబిల్లి, జి.ఎం .వలస గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన 80 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు జీవిత మార్గదర్శకాలపై మూడు రోజుల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి పారినాయుడు అధ్యక్షతన విశ్రాంత ఐఏఎస్ అధికారి మరియు శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ శిక్షకులు జె.మురళి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా జె.మురళి మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నత చదువులు మరియు పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి? విజయాలను ఎలా అందుకోవాలి, ధ్యానం ద్వారా జ్ఞాపక శక్తిని ఎలా పెంచుకోవాలి, తెలివితేటలను ఎలా వృద్ధి చేసు కోవాలి, మానవ జీవన విధానంలో సన్మార్గం వైపు మార్పు రావాలంటే ధ్యానం నిత్యజీవితంలో ఒక భాగం కావాలన్నారు. మనసు ఒకరోజులో అరవై వేలు (60,000) ఆలోచనలు చేయడం జరుగుతుందని ఆలోచన లో ఉత్తమమైనవి ఆచరించి వారి యొక్క ఉన్నత శిఖరాలను సాధించ డానికి మెట్లుగా మార్చుకోవాలన్నా రు. ప్రస్తుత ఆధునిక పోటీ ప్రపంచం లో ఆరోగ్యకరంగా ఉండాలన్న, నిలకడగా చదివిన అంశాలు గుర్తు ఉండేలా మరియు గుర్తు ఉండే అంశాలు పరీక్ష పేపర్లలో చక్కగా రాయగలిగేటప్పుడు నిరుద్యోగ యువత యువకులు ఉన్నత శిఖరాలు అందుకోగలరని అందుకు గల అతి సులువుగా లభించే ఏకైక మార్గం ప్రతిరోజు ఉదయం కొంత సమయం ధ్యానం చేయడమేన న్నారు. ప్రపంచ దేశాలు ధ్యానానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, మన దేశం లోని ప్రభుత్వం కూడా సముచిత స్థానం కల్పించడం జరుగు తుందనన్నారు.ఆస్తులు- అంతస్తులు లేకపోయినా మనసు నిర్మలముగా, కల్మషం లేకుండా ఉండాలంటే, ధ్యానం ప్రతి రోజూ చేసే వారికి మాత్రమే సాధ్యపడుతుందన్నారు. ముఖ్యంగా ఆదిశక్తి ప్రతిరూపాలైన మహిళలు ఏకాగ్రతతో ధ్యానం చేసినచో అద్భుత ఫలితాలు సాధిస్తారని ధ్యానంలోని వివిధ రకాలను వివరిస్తూ చేపించడం జరిగినది.జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డొల్లు పారినాయుడు మాట్లా డుతూ ప్రపంచంలోని సమస్త విజ్ఞా నాన్ని మెదడులో నిక్షిప్తం చేయ వచ్చునని సమయాన్ని వృధా చేయ కుండా అనవసర విషయాల ఆలో చించకుండా, అవసరమైన విష యాలపై దృష్టి సారిస్తే ఫలితాలు సులభంగా సాధించవచ్చు అన్నారు. మంచి ఆలోచనలు సరైన సమ యంలో క్రమబద్ధంగా ఆచరించినచో ఎక్కువ ప్రయోజనం కలుగుతుంద న్నారు.మంచి లక్ష్యాలను ఏర్పరచు కుని పట్టుదలతో దృష్టి సారించి మన శక్తి మేరకు సామర్థ్యాలను ఉపయోగిస్తే ఎంతటి ఆసాధ్యమైనా, సుసాధ్యం చేయవచ్చని అన్నారు. ప్రతి వ్యక్తి ప్రణాళికను తయారుచేసి జీవితంలో ఆచరిస్తే మంచి ప్రయో జనం కలుగుతుందన్నారు.ఈకార్య క్రమంలో శిక్షకులు ఉదయభాస్కర రావు, శ్రీధర్, సోమశేఖర్, వాలంటీర్ ఉమ మరియు జట్టు సిబ్బంది గొల్లు మురళీమోహన్, మరడాన గౌరీశంక ర్రావు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ స్కూల్ సిబ్బందికి సర్టిఫికెట్స్ అందజేసిన జిల్లా ప్రజా రవాణాధికారి



**కురుపాం, మే 14, మేజర్ న్యూస్ :** విజయనగరం ఏపీఎస్ఆర్టీసీ డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూల్ లో 21వ డ్రైవింగ్ స్కూల్ బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమములో ట్రైనింగ్ డ్రైవర్స్ కి సర్టిఫికెట్స్ తో పాటూ తగు సూచనలను విజయనగరం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా రవాణా అధికారి అప్పల నారాయణ తో పాటు డిపో మేనేజర్ శ్రీ జే శ్రీనివాసరావు, డ్రైవింగ్ స్కూల్ ఎస్డిఐ డిఎన్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటీరియర్ & ఎక్స్టీరియర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీనాయన

**బొబ్బిలి, మే 14: మేజర్ న్యూస్:** బొబ్బిలి నియోజకవర్గం, బొబ్బిలి హెడ్ క్వార్టర్ లో బొబ్బిలి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన మరిపి సతీష్ & శ్రీ రామ్ జెడి ఇంటీరియర్ & ఎక్స్టీరియర్ ను బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె రంగారావు (బేబీ నాయన) బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రోత్ సెంటర్ లో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు కు కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్షుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



## 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి



**పాలకొండ మే 14, మేజర్ న్యూస్ :** కరోనా కష్టకాలంలో కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారన తీసుకొచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని అదే సందర్భంలో కార్మిక హక్కులను కలిగిస్తున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చడం,వ్యవసాయ మార్కెట్ వ్యవస్థను సర్వ నాశనం చేసి ఆదాని,అంబానీల వంటి బహుళ జాతి సంస్థలకు ఊడిగిం చేయడానికి పై వర్గాల హక్కులను,చట్టాలను పూర్తిగా తొలగించే చర్యలను గత అనేక సంవత్సరాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలుపుతున్న వారికి చీమకుట్టినట్టునైనా లేదు. గనుక మరోసారి దేశ వ్యాప్తంగా సమ్మెకు మద్దతుగా గ్రామీణ ప్రాంతంలో రైతు,కూలీలలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తు సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు పాలకొండలో పోస్టర్ను విడుదల చేశారు. ప్రధాన సమస్యలైనా రైతులు పండిస్తున్న పంటలకు కీర్తిశేషులు డాక్టర్ స్వామినాథన్ తెలిపిన సీటు 50 శాతాన్ని కలిపి మద్దతు చట్టం తీసుకురావాలని, ప్రస్తుతం అమల్లో ఉన్న మార్కెట్ యార్డ్ విధివిధానాలను కొనసాగించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ను ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని,కార్మిక వర్గం యొక్క ప్రధాన సమస్యలైనా నిజవేతనాలు,సమాన పనికి సమాన వేతనం,స్కీం వర్కర్లైన అంగన్వాడి, మధ్యాహ్న భోజనం కార్మికులు,ఆశ వర్కర్లు,కాంట్రాక్ట్ తదితర కార్మికుల హక్కులను కాపాడు వరకు జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల వారు కావాలని అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. గోడ పత్రికను విడుదల చేసిన వారిలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గురుబిల్లి అప్పలనాయుదు,కిమిడి రామ్మూర్తి నాయుడు కౌల రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు, వావిలపల్లి రమణమూర్తి జిల్లా ఉపాధ్యక్షులు,రౌతు సోంబాబు గుడివాడ నీటి సంఘం అధ్యక్షుడు, ఎద్దుబోయిన సింహాద్రి, పామోటి వైకుంఠ రావు నీటి సంఘం డైరెక్టర్,లుకలాపు సంఘం నాయుడు ఉన్నారు.

# సమన్వయంతో శ్యామలాంబ జాతరను విజయవంతం చేయాలి: కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్




**పార్వతీపురం మే 14, మేజర్ న్యూస్ :** సాలూరులో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు పెద్దఎత్తున జరగనున్న శ్యామలాంబ తల్లి అమ్మవారి జాతరను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేసారు. శ్యామలాంబ జాతర నిర్వహణపైసంబంధిత అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15 ఏళ్ల తరువాత జరుగుతున్న శ్యామలాంబ జాతరకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. కావున జాతర జరిగే మూడు రోజులూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు చోటుచేసుకోకుండా, సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతరకు విచ్చేసే భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అన్నారు. సాలూరుతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు రానున్న నేపథ్యంలో అందుకు తగినట్లుగా ఆర్.టి.సీ బస్సులను నడపాలని తెలిపారు. ఇందుకు జాతర జరిగే నాలుగు రోజుల్లో నాలుగు జిల్లాలకు చెందిన 1240 బస్సులను ఏర్పాటుచేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు కలెక్టర్ కు వివరించారు. జిల్లాస్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమును ఏర్పాటుచేసి పర్యవేక్షణ చేయనున్నామని, తద్వారా విద్యుత్, పోలీస్, రెవిన్యూ, పంచాయితీరాజ్, ఇతర శాఖల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుండాలని సూచించారు. అదేవిధంగా అనుకోని సంఘటనలు ఏర్పడితే తక్షణమే స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. జాతరకు వచ్చే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కొరకు గుర్తించిన ఐదు స్థలాలను సిద్ధం చేసుకోవాలని, సిరిమాను తిరిగే ప్రాంతాలతో పాటు అన్ని ముఖ్య ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తుతో పాటు 30 రోప్ పార్టీలను సంసిద్ధం చేయాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భక్తులందరూ ఒకే ప్రాంతంలో గుమిగూడకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సాలూరు పట్టణ రహదారుల్లో గుర్తించిన 22 పాట్ హెూల్స్ ను తక్షణమే పూర్తిచేయాలని, పాతబడిన, పాడుబడిన గృహాల వద్ద, భవనాలకు దగ్గరగా ఉన్న విద్యుత్ తీగలు వద్ద ప్రజలు ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ ను ఆదేశించారు. వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయం, అందుబాటులో ఉన్న మరుగుదొడ్లతో పాటు గుర్తించిన 15 ప్రాంతాల్లో అదనంగా 50 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తహశీల్దారు, ఎంపీడీఓ, కమిషనర్ సంయుక్తంగా వాణిజ్యవేత్తలు, ఎన్.జి.ఓల సహకారంతో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటుచేసి చల్లని తాగునీరు, మజ్జిగ వంటి వాటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా అవసరమైన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుచేసామని, సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్ ను నిలిపివేస్తున్నామని, ఆ సమయంలో విద్యుత్ కు అంతరాయం కలగకుండా కమిటీ సహకారంతో జనరేటర్లను ఏర్పాటుచేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్.ఈ కలెక్టరుకు వివరించారు. జాతరలో పారిశుధ్యం ప్రధానమని, కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా అదనపు సిబ్బందిని సిద్ధం చేసుకొని, పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం, కమిషనర్ సంయుక్తంగా తాగునీటికి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. 14 వైద్య బృందాల ద్వారా 378 మంది వైద్య సిబ్బంది జాతర ముగిసే వరకు నిత్యం సేవలు అందించాలని, అంబులెన్సులు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దేవాలయానికి అలంకరణ, క్యూ లైన్లు, భక్తులకు, చిన్నారులకు తాగునీరు, పాలు, మజ్జిగ వంటి ఏర్పాట్లతో పాటు మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని ఆలయ ఈఓను ఆదేశించారు. అధికారులందరూ వారికి అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించి జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఎస్డిసీ డా. పి.ధర్మ చంద్రారెడ్డి, ఆలయ ఈఓ టి.రమేష్, మండల ప్రత్యేక అధికారి శివన్నరాయణ, మునిసిపల్ కమిషనర్ డి.టి.వి.కృష్ణారావు, మండల తహసీల్దార్ ఎన్.వి.రమణ,ఎంపిడీఓ జి.పార్వతి, ఏపీఈపిడిసిఎల్ ఎస్ఈ కె.చలపతిరావు, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి టి.కొండలరావు, జిల్లా ఎక్సయిజ్ అధికారి ఎం.రవి ప్రసాద్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, జిల్లా విపత్తుల స్పందన అధికారి కె.శ్రీనుబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, పోలీస్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పది లక్షల ప్రమాద బీమా అందజేసిన స్టేట్ బ్యాంక్ సిబ్బంది



**సీతానగరం మే 14 మేజర్ న్యూస్:** మండలంలో పెదబోగీల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పరిధిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన యువకుడు కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి వ్యక్తిగత ప్రమాద బీమా పథకం కింద పది లక్షల రూపాయలు చెక్కును కుటుంబ సభ్యులకి అందజేసినట్లు ఎస్బిఐ రీజనల్ మేనేజర్ బి బి సాహెూ. ఎస్బిఐ మేనేజర్ కే శ్రీ హర్ష తెలిపారు. ఈ మేరకు రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ పెదబోగీల గ్రామానికి చెందిన సురగాల అనుదీప్ ఖాతాదారుడు జనవరి నెల 14వ తేదీన సువర్ణముఖి నదిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారని ఈ సంఘటనలో మృతుడికి స్టేట్ బ్యాంకు నుండి వ్యక్తిగత ప్రమాద బీమా స్కీం ఉండడంతో మృతుడు నామిని అయినా సురగాల మైధిలి కి పది లక్షలు చెక్కును అందించడం జరిగినది తెలియజేశారు ఇటువంటి పథకాలు స్టేట్ బ్యాంకులో అనేక రకాల స్కీములను ఖాతాదారులు వాటిని సద్వినియోగం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్మెంట్ సిబ్బంది. ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు

## రామభద్రపురంలో ఆక్రమణల తొలగింపు



**రామభద్రపురం, మే 14 మేజర్ న్యూస్:** మండల కేంద్రంలో బైపాస్ జంక్షన్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకు రోడ్డు ఆక్రమణలను బుధవారం అధికారులు తొలగించారు. ఉదయం నుంచే జేసీబీతో ఆక్రమణలు తొలగించారు. తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎస్ఐ వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో జేసీబీలతో ఈ కార్యక్రమం చేపట్టారు. విఆర్వోలు, పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయితే ఎన్నో దశాబ్దాల నుంచి రోడ్లు ఆక్రమణకు గురవ్వడం, ట్రాఫిక్కు తీవ్ర ఇబ్బందులు, ప్రమాదాలు చోటుచేసుకోవడంతో అధికారులు గత నెల రోజుల నుంచి ఈ ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. అలాగే ఇటీవల బొబ్బిలి రూరల్ సీఐ కే.నారాయణరావు ఆధ్వర్యంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించి ఎన్ని అడుగుల మేర ఈ ఆ క్రమణలు తొలగించాలన్నదానిపై క్షుణ్ణంగా చర్చించారు. రోడ్డుకు 2 వైపులా 50 అడుగుల స్థలాన్ని ఖాళీ చేయించడానికి రెవెన్యూ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. దీంతో ఈ ఆక్రమణల తొలగింపునకు పెద్ద అడ్డంకి తప్పింది. చాలా మంది వ్యాపారస్థులు స్వచ్ఛందంగా ఈ ఆక్రమణల తొలగింపునకు సహకరించడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. దీంతో ఈ ఆ క్రమణల తొలగింపు ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

## మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



**సీతానగరం మే 14 మేజర్ న్యూస్:** మే 20 ని నిర్వహించనున్న జాతీయసమ్మెను జయప్రదం చేయడానికి అందరూ కృషిచేయాలని సిఐటియు నాయకులు జి. వెంకటరమణ, ఆర్, ఈశ్వరరావు తెలిపారు అనంతరం సిఐటియు నాయకులు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం,కౌలు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత నుండి ప్రజాస్వామ్య హక్కులను హరించే విధంగా విధానాలను అవలంబిస్తున్నాయని అందులో భాగంగానే 49 కార్మిక చట్టాలను రద్దు చేసే నాలుగు లేబర్ కోడ్లు గా రూపొందిస్తున్నారని విమర్శించారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రవేశపెట్టి రైతులు గిరిజనులు కార్మికులు తదితర ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చే విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. దేశంలో రైతుల పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, వ్యవసాయ కార్మికులకు, పారిశ్రామిక కార్మికులకు చేసేందుకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర చట్టం తెచ్చి వారి జీవనం మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీన జరుగుతున్న సమ్మెలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి లక్షుంనాయుడు, ఆర్, రమణ మూర్తి, వి. రామలక్ష్మి, ఆర్, రాము, వై రామారావు, మగ్రాపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు



**గరుగుబిల్లి, మే14, మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగముగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈమేరకు రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఎ కృష్ణమోహన్ ఉత్తర్వులు మేరకు, ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోనెల లక్ష్మీ ఆదేశాలు మేరకు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరమును నిర్వహించడం జరుగుతోందని శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు.వేసవి శిక్షణ శిబిరంకు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో పాటు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు నుంచి జూన్ ఆరవ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరమును గ్రంథాలయంలో నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్,ఆటల పోటీలు తదితర కార్యక్రమాలను ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు.ఈమేరకు వేసవి శిక్షణ శిబిరమును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయం నిర్వాహకులు మధు సూదనరావు కోరారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలో నలుగురు డిబార్

**పూసపాటిరేగ, మీ 14, మేజర్ న్యూస్:** ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల్లో నలుగురు డిబార్ అయినట్లు చీప్ సూపర్డెంట్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో గణితం తో పాటు జీవ శాస్త్రం కు సంబంధించిన పరీక్షలు బుధవారం జరిగాయి. ఈ పరీక్షల్లో పూసపాటిరేగ సూర్యోదయ కళాశాలకు చెందిన విద్యార్థుల ముగ్గురు డిబార్ కాగా, ఒకరు కుక్కర్ల గురుకుల విద్యాలయానికి సంబంధించిన విద్యార్థి డిపార్ అయ్యారు. డిపార్ అయిన విద్యార్థుల్లో గణితశాస్త్రం కు సంబంధించిన ఇంటర్ ఫస్టియర్ సంబంధించిన ఒకరు అదే విధంగా సెకండ్ ఇయర్ విద్యార్థి చూచిరాతలకు పాల్పడి డిబార్ కాగా సెకండ్ ఇయర్ బోటనీ లో చూసి రాతలకు పాల్పడిన వారు మరో ఇద్దరు డిబార్ కావడం గమనార్హం.

## నవధాన్య సాగుతో రైతులకు ప్రయోజనాలు



**సీతానగరం మే 14 మేజర్ న్యూస్:** మండలం సురంపేట గ్రామంలో నవధాన్య సాగు వలన వచ్చే భూసార విలువలు గురించి రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్ అవినాష్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ నవధాన్యలు అనగా తొమ్మిది రకాల జాతుల విత్తనాలు ను వరి నారు వేసుకునేముందు పొలం లో జల్లుకొని సరైన సమయంలో పూత పూసే సమయం లో భూమిలో కలియదున్నటం వలన భూమి లో లోపల ఉండే పోషకాలు భూమి పై పొరల్లోకి వచ్చి పంట దిగుబడి ను పెంచుతుంది అని ఎరువుల వాడకం తగ్గుతుంది అని తద్వారా రైతులకు పెట్టుబడిలు తగ్గి రైతుల కు మేలు చేకూరుతుంది అని అలాగే అన్నదాత సుఖీభవ పథకం లో భాగంగా రైతులు కి పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఇవ్వటం జరుగుతుంది ఈ పథకం యొక్క నమోదు ఈ నెల 20 వ తో ముగుస్తుంది అని రైతులందర ఆయా రైతు సేవ కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల ను సంప్రదించవలసిందిగా అలాగే రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆధార్ నెంబర్ తప్పుగా నమోద్ అయినా రైతులు రెవెన్యూ శాఖ ద్వారా సరి చేసుకొని అప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు చనిపోయిన రైతులు ప్రస్తుతం నిలిపి వేయడం జరుగుతుంది వారసులు మ్యుటేషన్ చేసుకున్నాక వారికి వర్తిస్తుంది అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు. రైతులు తోపాటు పాల్గొన్నారు

## నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి




**పార్వతీపురం, మే 14, సూర్య మేజర్ న్యూస్** :ప్రభుత్వ నిబంధనలు ను పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సమస్యలు పై చర్యలు తీసుకోవాలని ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే బుక్స్, యూనిఫామ్,బెల్ట్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి వేలాది రూపాయలతో వ్యాపారాలు జరుగుతున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. 2009 లో వచ్చిన విద్య హక్కు చట్టం ప్రకారం ఏ కార్పొరేట్ మరియు ప్రైవేట్ విద్యా సంస్థల్లో పుస్తకాలు యూనిఫామ్ బెల్ట్ అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ,ఎవరు సరిగ్గా పాటించడం లేదన్నారు.ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయాన్ని ముట్టడించడానికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పిలుపునిస్తామన్నారు.

## టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



**పాలకొండ, మే 14, సూర్య మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పట్టణంలోని చిన్నకాపువీధి కూడలిలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుమ్మిడి సింహాద్రి, సీహెచ్ శివానంద్, అంపోలు శ్రీనివాసరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆనాపు జవరాజుల సమక్షంలో కార్డులను కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు ఎన్నడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తల నుంచి పుట్టిన పార్టీగా టీడీపీకి పేరుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శాసపు సర్వారావు, గార దుర్గారావు, స్కూల్ కమిటీ చైర్మన్లు ఉదయాన పాపినాయుడు, పేకేటి నీలకంఠం, ఎన్ని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వే పనులు వేగవంతంగా నిర్వహించాలి



**సీతానగరం మే 14 మేజర్ న్యూస్:** భూ సర్వే పనులు వేగవంతంగా నిర్వహించాలి సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులకు సూచించారు ఈ మేరకు ఆయన దయానిధి పురం గ్రామంలో జరుగుతున్న భూ సర్వే ని పరిశీలించారు. అనంతరం మండల తాసిల్దార్ కార్యాలయంలో లచ్చయ్యపేట గ్రామంలో జరిగిన భూ సర్వే సంబంధించి రికార్డులను పరిశీలించారు. రెండో విడతలో బల్ల కృష్ణాపురం గ్రామం దయానిధి పురం గ్రామం రిసర్వే పనులు చేపట్టిన పనులు సంబంధిత అధికారులతో మాట్లాడి పరిశీలించారు వీటి పనులన్నీ వేగవంతం నిర్వహించాలని గ్రామ వీఆర్వోలు రిసర్వేలు పూర్తి సమాచారం ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో హెచ్ డి టి ఉమామహేశ్వరరావు తో పాటు పలు గ్రామాల గ్రామ రెవెన్యూ కార్యదర్శి సర్వేలు ఉన్నారు

## వార్షిక రుణ ప్రణాళిక ఉన్నతిపై అవగాహన



**పార్వతీపురం, మే 14, సూర్య మేజర్ న్యూస్ :** వార్షిక రుణ ప్రణాళిక ఉన్నతి పై మహిళా సంఘాలకు అవగాహన కల్పించినట్లు పిడి డిఆర్డిఏ ఎం సుధారాణి పేర్కొన్నారు. బుధవారం కృష్ణ పల్లి గ్రామం లో గ్రామ సంఘాల కు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘాన్ని వార్షిక రుణ ప్రణాళిక ఎం సి పి తయారు చేసే విధానాన్ని అలాగే జియో ఫెన్సింగ్ ఎఫ్ ఆర్ ఎస్ ముఖచిత్రాన్ని సభ్యులందరితో చేయాలన్నారు.ఈ కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగిందన్నారు.ఇందులో ఉన్నతి ఏపిఎం సతీష్ హెచ్ది ఏపీఎం చిన్నతల్లి సీసీలు వివోఏ శ్రీ దుర్గా సంఘం శ్రీరామ మహిళా సంఘం సభ్యులు రావడం జరిగిందని తెలిపారు.ఈ విధానం ఏ విధంగా ఉందన్నదని స్వయంగా పరిశీలించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం లో ఏ పి యం సన్నిబాబు, సి సి లు మహిళా సంఘాలు పాల్గొన్నారు.




## విపత్కర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్






**పార్వతీపురం, మే 14, మేజర్ న్యూస్ :** అత్యవసర, ప్రమాద సమయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలను సన్నద్ధతను చేసి, స్వీయ రక్షణ పొందేందుకే మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అయినప్పటికీ అనుకోని ప్రమాదాలు సంభవిస్తే వివిధ ప్రభుత్వ శాఖలు ఏ రకమైన తక్షణ సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందో ప్రజలకు తెలియజేయడమే ఈ మాక్ డ్రిల్ ఉద్దేశ్యమని కలెక్టర్ వెల్లడించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ లో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యం, ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర శాఖలు సంయుక్తంగా మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు, యుద్ధ వాతావరణ సమయంలో పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, సివిల్ డిఫెన్స్, ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ తదితర శాఖలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం సైరన్ మోగితే పరిస్థితిలో తీవ్రత ఉందని గ్రహించాలని, అందుకు తగిన విధంగా సురక్షిత చర్యలు తీసుకోవడం, అధికార యంత్రాంగంతో సహకరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రమాద స్థితిగతులను మైకు ద్వారా ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందని, తద్వారా ప్రజలు స్వీయ రక్షణ పొందాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు. అయినప్పటికీ అనుకోని ప్రమాదాలు సంభవించే సమయంలో ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకొని, సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పనులను ఆయా శాఖలు పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. ప్రజలతో పాటు పాడి పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర సమయంలో పోలీసు, రెవిన్యూ, అగ్ని మాపక, హెల్త్, అర్.టి.సి, ఎస్డిఆర్ఎఫ్ ఇతర శాఖలు సమన్వయంతో సహాయక చర్యలు చేపడతాయని ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ సివిల్ మాక్ డ్రిల్ యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల విభాగాలు తక్షణమే స్పందించి ఘటన స్థలానికి చేరుకొని ప్రజల రక్షణ, నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్, డా. పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు,జిల్లా ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్మోహనరావు, జిల్లా విపత్తుల రక్షణ, అగ్నిమాపక అధికారి కె.శ్రీను బాబు, ఏపీ ఎస్డీఆర్ఎఫ్ ఆర్.ఎస్.ఐ రఘు, ఏపీఈపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చటలపతిరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ ఎం.శశికుమార్, పోలీస్, పశు సంవర్ధక, ఆర్.టి.సి ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా సుంకి పోలమ్మతల్లి గుడి ప్రతిష్ట మహోత్సవాలు



**గరుగుబిల్లి, మే14, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని సుంకి గ్రామంలో పోలమ్మ తల్లి అమ్మవారి గుడి ప్రతిష్ట మహోత్సవములు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంకాలం నిర్వహించిన తిరువీధి మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా పోలమ్మ తల్లి అమ్మవారి గుడి ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అదేవిధంగా పోలమ్మతల్లి అమ్మవారి గుడి ప్రతిష్ట మహోత్సవములు సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన భక్తులు బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు తీర్థ ప్రసాదములను స్వీకరించారు. అమ్మవారి గుడి ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

## ఎన్టీఆర్ స్మార్ట్ సిటీస్ ఎం ఐ జి పై సెక్రటరీలకు అవగాహన సదస్సు




**నర్సీపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉషశ్రీ ఆధ్వర్యంలో బుధవారం సెక్రటరీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అడ్డూరు నందు ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్షిప్ ఎంఐ జి లేఔట్ మరియు ఓ బి పి ఎస్ అనుమతులు పై వి ఎం ఆర్ డి ఏ అధికారులు తో నర్సీపట్నం, నాతవరం ఎంపీడీఓ ఆఫీస్ లో ఎంపీడీఓ ఉషాశ్రీ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ లు తో అవగాహన సదస్సు జరిగినది. ఈ సమావేశంలో విఎమ్ఆర్డిఏ ద్వారా ఎన్టీఆర్ టౌన్షిప్ నియమ నిబంధనలు అనుసరించాల్సిన విధానాలు గురించి వివరించారు. టౌన్ ప్లానింగ్ ఆఫీర్ అరుణ వల్లి, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ డి శ్రీనివాస్, జె పి ఓ సునీత మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మునగపాక మండల టిడిపి అధ్యక్షునిగా పెంటకోట విజయ్ ఎన్నిక



**మునగపాక, మే 15, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక మండల టిడిపి అధ్యక్షునిగా పెంటకోట విజయ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు,నియోజకవర్గ సీనియర్ నాయుకులు మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావుఅధ్యక్షతన,నిర్వహించిన సమావేశం కీ ముఖ్య అతిథులు గా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, నియోజకవర్గం పరిశీలకులు మరియు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శిబోండా జగన్, హాజరై ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని 26 పంచాయతీలకు 22 పంచాయతీల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు హాజరైతమసమ్మతిని తెలియజేసారు. అందరి అభిప్రాయాలూ గౌరవించి జరిపించిన ఈ ఎన్నికల్లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ, రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ డైరెక్టర్ భీమర శెట్టి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు శ్రీ మతి ఆడారి మంజు, టిడిపి నాయకులు దాడి ముసిలి అప్పారావు, మొల్లేటి సత్యనారాయణ, మాద్దాల దొరమ్మ నాయుదు, ఆడారి జానకి, కడియం అనురాధ, రేబాక మాలతి,సబ్బి శ్రీనివాసరావు అనేకమంది సీనియర్ నాయకులు,యూనిట్ ఇంచార్జిలు బూత్ ఇంచార్జిలు,పాల్గొన్నారు.

## గిరిజనుల దాహాన్ని తీర్చిన నవనిర్మాణ సమితి...



**కొయ్యూరు, మే 14, మేజర్‌న్యూస్:** మండలంలోని అతి మారుమూల భూదరాళ్ల పంచాయితీ పరిధిలో బాలరేవులు,పోతవరం గ్రామాల్లో విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో నిర్మించిన రెండు రక్షిత మంచి నీటి వాటర్ ట్యాంక్ లను సర్పంచి సాగిన ముత్యాలమ్మ బుధవారం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో శాశ్వతంగా మంచినీటి సదుపాయం అందించిన సంస్థ ప్రతినిధులకు, వాటర్ ట్యాంకు కొరకు చొరవ చూపిన సర్పంచ్ ముత్యాలమ్మకు గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరావు పంచాయితీ సెక్రెటరీ లీల కృష్ణ,ఎంపీటీసీ బ్రదర్ వంతల నారాయణ, పంచాయితీ సభ్యులు సంజీవ్, తేజ, భారతి, పద్మ మరియు ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ సేవలు ప్రజలకు అందించాలి

### - సీఐటీయూ ఆర్ రాము



**అచ్చుతాపురం, మే 14, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ యాజమాన్య సంస్థ అయిన ఏపీ ఎస్ ఎఫ్ ఎల్ 2015 లో ప్రారంభమైంది నెలకు 350 రూపాయలు వినియోగదారులు వద్ద ఛార్జీలు పెరుతో వసూలు చేస్తున్నారు ఈ మధ్యకాలంలో ఎప్పుడు టీవీ ఆన్ చేసిన ఎర్రర్ 500 అని వస్తుంది తప్ప టీవీ చానల్స్ రావడం లేదు అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు ప్రభుత్వం నెట్టు, చానల్స్ అందిస్తామని చెప్పినా ఆచరణలో వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారు కేబుల్ ఆపరేటర్లను సంప్రదించిన మాకు సంబంధం లేదు పైనుంచి రావడం లేదని తప్పించుకుంటున్నారు ఇది అత్యంత దుర్మార్గం కేబుల్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లిస్తున్న సర్వీస్ ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ ఫైబర్ నెట్ పెట్టుకున్న ప్రజలను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారు కేబుల్ ఆపరేటర్ల పై తగు చర్యలు తీసుకొని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము డిమాండ్ చేశారు.

## నడింపల్లి గ్రామంలో అక్రమ గ్రావెల్ దందా



**అచ్యుతాపురం, మే 14, మేజర్‌న్యూస్:** అచ్యుతాపురం మండలంలోని నునపర్తి పంచాయతీ రెవిన్యూలో నడింపల్లి గ్రామంలో సర్వే నంబర్ 76లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. అనుమతి లేకుండా జేసీబీలు కొండలపై దాడి చేస్తూ, వేలాది రూపాయల విలువైన గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ అక్రమ చర్యలు ప్రభుత్వ భూమిపై జరుగుతున్నాయి, కానీ స్థానికులు చేసిన అనేక ఫిర్యాదుల తర్వాత కూడా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. స్థానికులు మాట్లాడుతూ, కొండలను నరికేసి చెట్లను నిర్మూలించడం వల్ల పర్యావరణ సమతుల్యతకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని,అంతేకాకుండా ప్రభుత్వానికి ఆదాయ నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమ దందా కొనసాగడం మరింత ఇబ్బంది కలిగిస్తున్నది. స్థానిక ప్రజలు ఈ అక్రమ దందాలో అధికారుల సాయంవున్నట్లు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలు ఈ విషయంపై ఉన్నతాధికారులను వెంటనే స్పందించి, సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వైసిపి పార్టీకి తీరని లోటు

### - మాజీ ఎమ్మెల్యే కన్నబాబు



**మునగపాక, మే 15, మేజర్‌న్యూస్:** మండలం లోఉమ్మలాడ గ్రామానికి చెందిన కరోతి గణేష్ ఈ నెల నాలుగో తేదీన తిరుపతి నుండి వస్తు తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుండి జారిపడి మరణించిన విషయం తెలిసిందే. బుధవారం ఉమ్మలాడ గ్రామంలో వారి కుటుంబ సభ్యులను ఎలమంచిలి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు యు వి రమణ మూర్తి రాజు పరామర్శ చేశారు. గణేష్ లాంటి వీరాభిమాని వైసీపీ పార్టీకి తీరని లోటుని మాజీ ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు అనంతరం గణేష్ అభిమానులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలవేంద్రాన్ని ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో మునగపాక జడ్పిటిసి సభ్యులు పెంటకోట సోమ సత్యనారాయణ ,మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు , మండల యువజన శాఖ అధ్యక్షులు బొడ్డేడ లిల్లీ, మునగపాక మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మందా రాము, ఎంపీటీసీ సభ్యులు మొల్లేటి నారాయణరావు మల్ల కాశి సురేష్ , బొడ్డేడ బుజ్జి, ఉమ్మలాడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మొల్లేటి వినోద్, కరోతి విజయ్ కుమార్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు , గణేష్ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు



**దేవరాపల్లి, మే 14, మేజర్‌న్యూస్:** మండలంలోని 12 రైతు సేవా కేంద్రాలు పరిదిలో 8 గ్రామాల రైతులకు 32.13 లక్షలు విలువ చేసే 14 పవర్ టిల్లర్ లను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అందజేశారు. మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద మండల వ్యవసాయ అధికారిణి ఎల్ వై కాంతమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సబ్సిడీ రూపంలో 14 లక్షలు రైతులకు ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు. పవర్ టిల్లర్ లు కాకుండా 63 రకాల వివిధ వ్యవసాయ పనిముట్లు - నాగలి సెట్లు, దమ్ము సెట్ లు, రోటావేటర్ లు, పవర్ విడర్, పురుగు మందులు పిచికారి చేసే స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాడుగుల నియోజకవర్గం పరిశీలకులు ఏసుదాస్, రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పోతల పాత్రు నాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్ష,కార్యదర్శులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరకాన సూర్యనారాయణ, పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## కృషి సంకల్ప్ అభయాన్

### - రైతు శాస్త్రవేత్తల సంభాషణ

### - ల్యాబ్ టు ల్యాండ్ మంత్రం ద్వారా రైతులకు చేరువ




**అచ్చుతాపురం, మే 14, మేజర్ న్యూస్:** కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ మరియు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆదేశానుసారం మే 29 నుంచి జూన్ 12 వరకు కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమాన్ని జిల్లా మొత్తం నిర్వహిస్తున్నట్లు బిసిటీ - కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా తెలిపారు. ఇదే కార్యక్రమాన్ని దేశం మొత్తం 700 పైగా జిల్లాలలో 731 కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు అనుబంధ శాఖల అధికారులతో బృందాలుగా ఏర్పాటు చేసి, వ్యవసాయం గురించి మరింత అవగాహన కల్పిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ వివరించినట్లుగా ఆమె తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఇచ్చిన "ప్రయోగశాల నుంచి భూమికి" అనే మంత్రాన్ని సాకారం చేసేందుకు, ఆధునిక మరియు ఆదర్శ వ్యవసాయంతో పాటు "ఒక దేశం, ఒక వ్యవసాయం, ఒక బృందం" వైపు ఒక ముఖ్యమైన చొరవ అని వివరించారు. అధనాతన పద్ధతులు, కొత్త రకాలు, ప్రభుత్వ పథకాలు, డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం, పంటల వైవిధ్యం వంటి విషయాలపై... స్థానిక వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులతో బృందాలుగా ఏర్పడి, అభ్యుదయ రైతులు మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో కూడా ఈ కార్యక్రమం అనుసంధించబడి జరుగుతుందని తెలిపారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

**అనకాపల్లి ప్రతినిధి ,మే 14 ,మేజర్‌న్యూస్:** మండలంలోని కొత్తూరు మేజర్ పంచాయతీ పరిధిలో గల కసింకోట సబ్‌స్టేషన్ 33 /11 కేవీ మరమ్మతుల, హెచ్ టి / ఎల్ టి లైన్లు కింద ఉన్న చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో గల కొత్తూరు, మూలపేట, సత్యనారాయణపురం, పిసినికాడ గ్రామాలకు శుక్రవారం అనగా 16 మే 2025వ తేదిన ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహ అవసరాల విద్యుత్, వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపిఈపిడీపీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు అందరూ సహరించాలని ఆయన కోరారు.

# మెలియాపుట్టిలో వర్షం

**మెలియాపుట్టి, మే 14, మేజర్‌న్యూస్:** మెలియాపుట్టి మండలంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రమైన ఎండతో పాటు వడగాలులు వీచాయి. సాయంత్రం మూడు గంటల సమయానికి వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలతో వర్షం ప్రారంభమైంది. ఈ వానతో పొలాల్లో దుక్కులు చేసుకోవచ్చని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# పిడుగు పాటుకు పాడిగేదె మృతి



**కొత్తూరు, మే 14, మేజర్‌న్యూస్:** కొత్తూరు మండలంలో బుధవారం సాయంత్రం భారీ పిడుగుళ్ళుకు కొత్త కొత్తూరు గ్రామానికి చెందిన లోతుగెడ్డ చలపతిరావు పాడి గేదె మృతి చెందింది.చలపతి గేదెలు పొలాల్లో మేపుతుండగా పిడుగులు పడి మృతి చెందిన నట్లు తహసీల్దార్ బాలకృష్ణ కు పిర్యాదు చేశారు.ఆయన ఈ విషయాన్ని అధికారికంగా తెలియ జేశారు. మృతి చెందిన గేదె విలువ సుమారు లక్షా యాభై వేల రూపాయలు ఉంటుందని గ్రామస్తులు తెలియజేశారు.

# కోదండ రాముని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



**మెలియాపుట్టి, మే 14, మేజర్‌న్యూస్:** మెలియాపూట్టి మండలం గొప్పిలి గ్రామ పంచాయతీ ప్రజల ఆహ్వానం మేరకు గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ కోదండరామాలయం ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో శ్రీకాకుళం పార్లమెంట్ తెదేపా అధ్యక్షులు ,పాతపట్నం మాజీ శాసనసభ్యులు కలమట వెంకటరమణ బుధవారం పాల్గొన్నారు. శ్రీ కోదండ రామ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. పాతపట్నం బిజెపి ఇంచార్జ్ సలాన శరత్ కుమార్, టిడిపి నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు ఉన్నారు.

# చాపర లో ఒకరిని కాటేసిన పాము



**మెలియాపుట్టి, మే 14, మేజర్‌న్యూస్:** మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన డోల అప్పడు ఉపాధి హామీ పనులకు వెళ్లి బుధవారం పాము కాటుకు గురయ్యాడు. గ్రామానికి సమీపంలో ఉన్న మహేంద్రతనయ నదిలో వరద కట్ట పనులు చేస్తుండగా విషసర్పం కాటు వేసింది. తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్ సింహాచలం చాపర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్య చికిత్సకు టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ప్రమాదం ఏమీ లేదని వైద్యులు తెలిపారు.

# ఉపాధి పనులు పరిశీలించిన కేంద్ర మోడల్ అధికారి



**మెలియాపుట్టి, మే 14, మేజర్‌న్యూస్:** మెలియాపుట్టి మండల కేంద్రంలో ని వెలుగు కార్యాలయం వద్ద ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రూపు వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణాన్ని, గోకర్ణ పురం గ్రామంలో ఫారం పాండ్స్ అభివృద్ధి పనులను జల శక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి వి .సుగుణాకర్ రావు బుధవారం పరిశీలించారు. ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసేటప్పుడు జియో టాకింగ్ చేసిన ప్రాంతంలోనే పనులు నిర్వహించాలని అన్నారు. వర్క్ ప్రెజర్ తో జియో టాకింగ్ లో తప్పిదాలు చేయవద్దని, ప్రతి పనికి మూడుసార్లు జియో ట్యాగ్ చేయాల్సిన అవసరం ఉంటుంది కాబట్టి బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీకి ఒక ఆర్థిక సంవత్సరానికి సరిపడా సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాలలో ఉపాధి పనులు చేపట్టాలన్నారు . ఆయనతోపాటు శ్రీకాకుళం జిఐఎస్ అధికారి శోభ, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి , ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరామ్ చాణుక్య,పలువురు సిబ్బంది ఉన్నారు.

# ఏపీ ఆర్ డి సి ఫలితాలలో "సంపత్ సాయి" ప్రభంజనం...

**- ఎంపీసీ విభాగంలో రాష్ట్ర ప్రథమ, తృతీయ స్థానాలు.**




**నరసన్నపేట, మే 14, మేజర్‌న్యూస్:** నరసన్నపేట పట్టణంలోని సంపత్ సాయి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన అడపా విజయ్ కుమార్ బుధవారం విడుదల చేసిన ఏపీ ఆర్ డి సి ఫలితాలలో రాష్ట్రస్థాయి మొదటి స్థానాన్ని ఎంపీసీ విభాగంలో సాధించి తన సత్తా చాటాడు. జ్ఞాన రూపేష్ శర్మ రాష్ట్రస్థాయి తృతీయ స్థానాన్ని ఎంపీసీ విభాగంలో సాధించారు. రాష్ట్రస్థాయిలో నరసన్నపేట పట్టణ పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేసిన సంపత్ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులను పలువురు అభినందించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంపత్ సాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి. గణపతిరావు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులచే అసాధారణ ఫలితాలు అందించేందుకు, సంపత్ సాయి అధ్యాపక బృందం కృషి చేస్తుందని, కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించేందుకు యాజమాన్య నిరంతరము కృషి చేస్తుందని, విద్యార్థుల విద్యాభివృద్ధి తో పాటు, వారి భవిష్యత్తు అవసరాల విద్యను, పోటీ పరీక్షలలో విజయాన్ని చేకూర్చే విద్యను అందిస్తామని, నేటి ఫలితాలు వాటికి తార్కాణం అని అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించి, మొదటి, తృతీయ స్థానాలులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన కళాశాల ప్రిన్సిపల్ ,డైరెక్టర్ బి. గణపతి రావు, వెలమల భాస్కరరావు, ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఏప్రిల్ 25వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఏపీఆర్డీసీ పరీక్షలు నిర్వహించింది.స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ అడపా విజయ్ (నరసన్నపేట) నరసన్నపేట గవర్నమెంట్ హైస్కూల్లో పదో తరగతి , ఇంటర్మీడియట్ ఎంపీసీ సంపత్ సాయి జూనియర్ కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నాడు. తండ్రి సింహాచలము లారీ డ్రైవర్ కాగా తల్లి లక్ష్మి గృహిణి. పదవ తరగతిలో 547 మార్కులు ఇంటర్మీడియట్లో 968 మార్కులు సాధించాడు. స్టేట్ తృతీయ ర్యాంకు జ్ఞాన రూపేష్ శర్మ (సారవకోట గ్రామం) సారవకోట నవ తేజ స్కూలులో పదవ తరగతి, సంపత్ సాయి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసాడు. తండ్రి కృష్ణ సాయిరాం వృత్తి పౌరోహిత్యం, తల్లి ప్రసన్న దేవి గృహిణి పదవ తరగతిలో 567 మార్కులు ఇంటర్మీడియట్ 984 మార్కులు సాధించాడు.

# తల్లిదండ్రుల పేరిట చలివేంద్రాలు ఏర్పాటు

**- పేటలో గత కొన్నేళ్లుగా ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ**

**- వివిధ సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న మార్పు విజయకుమార్**




**నరసన్నపేట, మే 14, మేజర్ న్యూస్:** నరసన్నపేట పట్టణంలో ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వద్ద గత 20 రోజులుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు చిక్కటి మజ్జిగను అందిస్తూ చలివేంద్ర నిర్వాహణ బాధ్యతను ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపకులు మార్పు విజయకుమార్ నిర్వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర ఆలయంలో 7వ తేదీ నుండి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల దాహార్తి తీర్చేందుకు ఆలయ ప్రాంగణమునందు ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని కూడా నిర్వహించడం విశేషం. ప్రతి సంవత్సరము వేసవి తీవ్రత అధికంగా ఉన్నన్ని రోజులు తన తల్లిదండ్రుల పేరిట చలివేంద్రాన్ని నిర్వహించడం, ఉచిత మజ్జిగను పంపిణీ చేయడం మార్పు విజయ్ కుమార్ దాతృత్వానికి నిదర్శనం. గత కొన్నేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలతో మార్పు విజయ్ కుమార్ సాగిస్తున్న ప్రయాణం పట్ల నరసన్నపేట పరిసర ప్రాంతవాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రుల పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహణకు విజయ్‌కుమార్ చేస్తున్న కృషిని అభినందిస్తున్నారు.

# జవాన్ మురళి నాయక్‌కు వైసీపీ ఘన నివాళి




**శ్రీకాకుళం, మే 14 , మేజర్‌న్యూస్:** దేశం కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్ మురళి నాయక్ స్మరణార్థంగా శ్రీకాకుళంలో బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మురళి నాయక్ త్యాగం దేశానికి గర్వకారణమని, ఈ ధైర్యసాహసాలు యూత్‌కు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అందవరపు సూరిబాబు,గేదెల పురుషోత్తం, మార్పు పృథ్వి, కామేశ్వరి, రాజాపు అప్పన్న, రౌతు శంకరరావు, చింతు రామారావు, అంబటి శ్రీనివాసరావు, గొండు రఘురాం, పొన్నాడ రుషి, ఎన్ని ధనుంజయరావు , ఎం.ఎ.బెగ్, తదితరులు పాల్గొన్నారు.

# రవిశంకర్ గురూజీ ఆశీస్సులు అందుకున్న ఎమ్మెల్యే శంకర్



**శ్రీకాకుళం, మే 14, మేజర్‌న్యూస్:** ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ పుట్టినరోజు సందర్భంగా బెంగుళూరులోని ఆయన ఆశ్రమానికి వెళ్లి ఎమ్మెల్యే గొండు శంకర్ ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనతో పాటు డాక్టర్ కింజరాపు అమ్మన్ నాయుడు , వారి యొక్క మిత్రబృందం తదితరులు ఉన్నారు.

## వైభవాన్ని తెలిపేందుకే రథోత్సవం



**ఆమదాలవలస, మే 14, మేజర్‌న్యూస్:** భగవాన్ సత్య సాయి అవతార వైభవాన్ని చాటి చెప్పేందుకు, సత్య సాయి స్వామి వారు ఆదేశించిన మానవత్వ విలువలు పాటించి సన్మార్గం లో నడవడానికి సత్యసాయి ప్రేమ వాహిని రథోత్సవం ముఖ్య ఉద్దేశం అని సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణ రావు అన్నారు. జిల్లా లో ప్రతి గ్రామంలో స్వామి వైభవం వ్యాప్తి చెందిందని, అందువల్ల రథయాత్ర జిల్లా లో అన్ని జోనల్లో రథయాత్ర జరిగే విధంగా రూట్ మ్యాప్ తయారు చేయటం జరిగిందన్నారు. మన్యం జిల్లా నుండి వచ్చిన రథానికి సత్య సాయి సేవా సంస్థ అధ్యక్షులు సూర రామచంద్రరావు ఆధ్వర్యంలో భక్తులు స్వాగతం పలికారు. బుధవారం ఉదయం మెట్టెక్కివలస సత్య సేవ మందిరం వద్ద రథయాత్రను ప్రారంభించారు. జిల్లా గ్రామ సేవలు ఇంచార్జ్ మునగవలస రవీంద్రబాబు, రాష్ట్ర ఐ.టి.కో ఆర్డినేటర్ ఆర్.కిషోర్, రాష్ట్ర విద్యా జ్యోతి ఇంచార్జి ఎస్.వి. గురుప్రసాద్, జిల్లా సేవాదళ్ ఇంచార్జి పి.నాగేశ్వరరావు, జిల్లా ఆధ్యాత్మిక విభాగం కో ఆర్డినేటర్ ఎస్. అనాదిగుప్త, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఇంచార్జి బోయిన నరసింహమూర్తి, వటవృక్షం జిల్లా ఇన్చార్జి ఎం.వి.రమణ మూర్తి, బూర్జ ఎం.పి.పి కర్నాన దీపా కన్వీనర్ గౌరీ శంకర్, పి.సుధా రాణీ, లలిత, కమలా త్రివేణి, మెట్టక్కివలస సమితి కన్వీనర్ కన్నేపల్లి కామావధానులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేదమంత్రోచ్ఛారణలు , కోలాటం భజన కార్యక్రమాలు జరిగాయి.

## నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారీ జాబ్ మేళా

**- 21న రణస్థలంలో నిర్వహణ...**



**ఎచ్చెర్ల, మే 14, మేజర్‌న్యూస్:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న రణస్థలం ఎన్.ఈ.ఆర్ స్కూల్ ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎచ్చర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తెలిపారు. బుధవారం ఎమ్.ఎల్.ఏ క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళాపై రూపొందించిన పోస్టర్‌ను జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో ప్రైవేట్ రంగ సంస్థలు కలసి నిరుద్యోగులకు అవకాశాలు కల్పిస్తున్నదన్నారు. ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుందన్నారు. దాదాపు 21 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్న ఈ మేళాలో 835 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. టీఏఓ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దివిస్, ఎన్‌ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఇసుజు మోటార్స్, డైకిన్ తదితర ప్రముఖ సంస్థలు మేళాలో పాల్గొననున్నాయని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ చదివిన 18-30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వెబ్‌సైట్ naipunyam.ap.gov.in ద్వారా అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెజ్యూమే, ఆధార్, ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8317652552, 8332039243 నంబర్లలో సంప్రదించవచ్చున్నారు.

## సత్తారు రామును సన్మానించిన సువ్వారి



**ఆమదాలవలస, మే 14, మేజర్‌న్యూస్:** జాతీయస్థాయి కబడ్డీపోటీల్లో ఆమదాలవలస మండలం అక్కులపేట గ్రామానికి చెందిన క్రీడాకారుడు సత్తారు రాము కబడ్డీ పోటీల్లో విజయం సాధించడంతో ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీ అభినందించారు. ఈ నెల 4 నుంచి 8 వరకు బీహార్ లోని రాజ్ గిర్ వేదికగా 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలు జరిగాయి.ఆంధ్రప్రదేశ్ బాలురు కబడ్డీ జట్టు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ పోటీల్లో ఆంధ్రప్ర దేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీకాకుళం జిల్లా క్రీడాకారుడు సత్తారు రామ్మోహన్ ను పుష్పగుచ్ఛం ఇచ్చి దుస్సాలువతో సన్మానించారు. రాబోయే రోజులులో బాగా కష్టపడి మరిన్ని విజయాలు సాధించి మంచి పేరు ప్రత్యేకతలు తీసుకొని రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈయనతో పాటు సువ్వారి అనిల్, పేడాడ వైకుంఠరావు, సువ్వారి రాధ, కోరుకొండ సాయికుమార్,పైడి విజయ్,బగాది నేతాజీ, తవిటిరెడ్డి, సూర కిరణ్, ధర్మ రాజశేఖర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ శ్రీకాకుళం అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవికి డాక్టర్ ప్రధానం



**శ్రీకాకుళం, మే 14, మేజర్‌న్యూస్:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (IIT) గౌహతీ నుండి అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవి. బయో ఫ్యూయల్ మరియు న్యూట్రాస్యూటికల్ సమ్మేళనాలపై చేసిన పాతప్రద పరిశోధనకు డాక్టరేట్ (Ph.D.) ప్రదానం. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (RGUKT), శ్రీకాకుళంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా సేవలు అందిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవి , దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో ఒకటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (IIT) గౌహతీ నుండి డాక్టరేట్ పట్టా (Ph.D.)ను పొందారు. ఆయన ఈ పరిశోధనను బయోసైన్సెస్ అండ్ బయోఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ వెంకట దాసు వీరంకి మరియు ప్రొఫెసర్ కన్నన్ పాక్షిరాజన్ సంయుక్త పర్యవేక్షణలో పూర్తి చేశారు. “ఓలియేజినస్ ఈస్ట్ Rhodotorula mucilaginosa ద్వారా లిపిడ్లు, కెరోటినాయిడ్లు మరియు బీటా-కెరోటిన్ ఉత్పత్తిపై అధ్యయనాలు” అనే శీర్షికతో చేసిన ఈ పరిశోధన, శక్తి మరియు ఆరోగ్య సంబంధిత సవాళ్లకు పరిష్కారాలను కనుగొనడంలో సూక్ష్మజీవి జీవసాంకేతికతను ఎలా వినియోగించవచ్చో విశ్లేషిస్తుంది. Rhodotorula mucilaginosa అనే సహజంగా పెరిగే ఈస్ట్‌ని ఉపయోగించి, మైక్రోబయల్ లిపిడ్లు, కెరోటినాయిడ్లు, ముఖ్యంగా బీటా-కెరోటిన్‌ను ఉత్పత్తి చేయడం పై ఆయన లోతైన పరిశోధన జరిపారు. ఈ పరిశోధన ఫలితాలు సమకాలీనంగా, వినియోగ ప్రయోజనాల పరంగా ఎంతో ప్రభావవంతమైనవిగా గుర్తించబడుతున్నాయి.అదే సమయంలో, కెరోటినాయిడ్లు మరియు బీటా-కెరోటిన్ వంటి సమ్మేళనాలు ఆహార రంగం, ఔషధ రంగం మరియు పోషకాహార పరిశ్రమల్లో అమూల్యమైనవి. కెరోటినాయిడ్లు ఆహార పదార్థాల సహజ రంగు ద్రవ్యాలుగా ఉపయోగించబడతాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తూ, ఫ్రీ రాడికల్స్‌ను నిరోధించడం, శరీరంలోని రోగనిరోధకతను మెరుగుపరచడం, క్యాన్సర్ వంటి వ్యాధుల రాకను అడ్డుకోవడం మరియు వృద్ధాప్యంతో వచ్చే మాక్యులార్ డిజెనరేషన్ వంటి పరిస్థితుల నుంచి రక్షణ కల్పించడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. బీటా-కెరోటిన్ అయితే ప్రొవిటమిన్‌గా పనిచేస్తూ, దృష్టి,రోగనిరోధక వ్యవస్థను బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవి పరిశోధన పరిశ్రమల వినియోగానికి అనువుగా, తక్కువ ఖర్చుతో స్థిరమైన బయో ప్రాసెసింగ్ విధానాలను అభివృద్ధి చేయడం పై దృష్టి సారించడం ద్వారా శాస్త్రీయ రంగానికి, అలాగే పునరుత్పాదక ఇంధన మరియు మానవ ఆరోగ్య రంగాలకు గొప్ప ఉపకారం చేకూర్చేలా ఉంది. ఆయన విజయాన్ని డైరెక్టర్ ప్రొఫెసర్ కె వి డి జి బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామకృష్ణ,అకడెమిక్ డీన్ శివ రామకృష్ణ,హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ బయోసైన్స్ డా. శివ ప్రవీణ,ఉపాధ్యాయులు అభినంధనులు తెలియపరిచారు.

## పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు కండి యువతకు మైభారత్ పిలుపు

**: డిప్యూటీ డైరెక్టర్ కె వెంకట్ ఉజ్వల్**

**శ్రీకాకుళం, మే 14, మేజర్‌న్యూస్:** భారత ప్రభుత్వం యువజన వ్యవహారములు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా యువతను మై భారత్ పౌర రక్షణ వాలంటీర్లుగా నమోదు కమ్మని పిలుపునిస్తుంది. నమోదు కాబడిన యువత జాతీయ ప్రయోజనాలలో ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలక పాత్ర పోషించడానికి సాధికారతను కల్పించడం జరుగుతుందని నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె వెంకట్ ఉజ్వల్ తెలిపారు. ఈ సమిష్టి ప్రయత్నంలో భాగంగా పకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ఇతరత్రా ఊహించని పరిస్థితులలో పౌర పరిపాలన పట్ల పూర్తి అవగాహన కల్పించే శిక్షణను పొంది, తదనుగుణంగా ప్రతిస్పందించే స్థితిస్థాపక స్వచ్ఛంద దళాన్ని నిర్ణయించడం ఈ చొరవ లక్ష్యమని నెహ్రూ యువకేంద్ర డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఉద్భవిస్తున్న భద్రతా సమస్యలు దృష్ట్యా, బలమైన కమ్యూనిటీ అధారిత ప్రతిస్పందన కోసం యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం పెరుగుతున్నదని, విస్తృత శ్రేణి సేవల ద్వారా స్థానిక అధికారులకు మద్దతు ఇవ్వడం, పౌర రక్షణ వాలంటీర్లు ఈ విషయములో కీలక పాత్ర పోసిస్తారని తెలిపారు. వీరికి రెస్క్యూ ఆపరేషన్, తరలింపు కార్యకలాపాలు, ప్రథమ చికిత్స, అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్మెంట్, జన సమూహ నియంత్రణ, ప్రజా భద్రత, విపత్తు ప్రతిస్పందన, పునరావాస ప్రయత్నాలలో సహాయం చేయడం ఉంటాయని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రకటనను విడుదల చేస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె వెంకట్ ఉజ్వల్ తెలిపారు. సన్నద్ధమైన శిక్షణ పొందిన పౌర దళం యొక్క ప్రాముఖ్యత గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా ఉందని, ఈ జాతీయ మిషన్ కు తోడ్పడటానికి మై భారత్ కట్టుబడి ఉందని ఈ నమోదు ప్రక్రియలో 18 సంవత్సరాల నిండిన 30 సంవత్సరాలలోపు వారైన యువత భాగస్వామ్యం కావాలని కె వెంకట్ ఉజ్వల్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం శ్రీకాకుళం పాలకొండ రోడ్ (శివాలయం దగ్గర) ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రక్కన ఉన్న నెహ్రూ యువ కేంద్ర కార్యాలయం పని వేళలో వచ్చి పొందవచ్చునని ఆయన సూచించారు. మై భారత్ దాని యువ స్వచ్ఛంద సేవకుల యొక్క డైనమిక్ నెట్ వర్క్ ను, ఇతర ఉత్సాహభరితమైన యువ పౌరులను - మై భారత్ సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా నమోదు చేసుకోవడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నదని కె వెంకట్ ఉజ్వల్ తెలిపారు. ఇప్పటికే ఉన్న మై భారత్ వాలంటీర్లు, ఈ హోదాలో దేశానికి సేవ చేయాలనుకునే కొత్త వ్యక్తులు ఇద్దరూ చేరవచ్చునని తెలిపారు. ఈచొరవ యువతలో క్రమశిక్షణ యొక్క బలమైన భావాన్ని పెంపొందించడమే కాకుండా, క్లిష్టమైన పరిస్థితుల్లో వేగంగా పనిచేయడానికి ఆచరణాత్మక ప్రాణాలను రక్షించే నైపుణ్యాలు, శిక్షతో వారిని సన్నద్ధం చేస్తుందని డిప్యూటీ డైరెక్టర్ కె వెంకట్ ఉజ్వల్ తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరళమైనదని అధికారిక మై భారత్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉంటుందని అన్నారు. వెబ్సైట్ https://mybharat.govt.inలో యువత ముందుకు వచ్చి ఈ జాతీయ లక్ష్యం కోసం ఆసక్తి గల యువత ప్రజలందరినీ సమీకరించాలని ఇది స్పష్టమైన పిలుపుకు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె వెంకట్ తెలిపారు. చరవాణి నెంబర్లు 99102 20993, 6395467609లలో కూడ సంప్రదించి సంబంధిత వివరాల్లో పొందవచ్చునని తెలిపారు.

## బజారు వీధిలో రోడ్లపై పారుతున్న మురికి నీరు

**- భరించరాని దుర్వాసనతో ఇబ్బందులు గురవుతున్న ప్రజలు**

**- పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపం**



**సంతబొమ్మాళి, మే 14,మేజర్‌న్యూస్:** మండలంలో నౌపడ గ్రామం బజార్ వీధిలో భరించరాని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి కాలువలలో పారాల్సిన మురికి నీరు వీధి రోడ్లపైకి వచ్చి దుర్వాసన వెదజల్లుతుంది. మరికొన్ని వీధి కూడలి లలో చెత్తంతా చేరడంతో రాకపోకలు సాగించేందుకు పాదాచారులు వాహనదారులు ముక్కులు మూసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. చెత్త మూలంగా దోమలు ఈగలు వృద్ధి చెంది ఇళ్లల్లోకి ప్రవేశిస్తుండడంతో ఎక్కడ అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలుతాయోనని ప్రజలు బీతిల్లుతున్నారు. బజారు వీధిలో మురికి కాలువల సమస్య ఎప్పటినుంచో వెంటాడుతుందని, చిన్నపాటి వర్షానికే ఇబ్బందులు తప్పడం లేదని వీధివాసులు వాపోతున్నారు. డ్రైనేజిలలో పూడిక తీత పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగు నీరంతా బజారు వీధి రోడ్లపై పొర్లుతుంది. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా.సి. అమూల్య బాధ్యతలు స్వీకరణ



**శ్రీకాకుళం,మే 14, మేజర్‌న్యూస్:** సేవలే గుర్తింపునిస్తాయి అని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా సి. అమూల్య అన్నారు. మే 14వ తేది బుధవారం పదోన్నతిపై శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ గా బాధ్యతలు స్వీకరించిరించారు. ఈమె మెడికల్ కాలేజి, విశాఖపట్నం లో ప్రొఫెసర్ అండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్, గైనిక్ నుండి పదోన్నతిపై వచ్చిరు.

# గ్రావెల్ అక్రమ తవ్వకాలు

### - పట్టించుకోని రెవెన్యూ అధికారులు



**సంతబొమ్మాళి, మే 14, మేజర్‌న్యూస్:** మండలంలో గోవిందపురంలో సర్వే నెంబర్ 71 కొండ నుండి అక్రమంగా టిప్పర్ల ద్వారా గ్రావెల్ ను తరలించుకుపోతున్నారు. రెవెన్యూ ,పంచాయతీ అధికారుల నుండి ఎటువంటి అనుమతులు లేకపోయినా దౌర్జన్యంగా గ్రావెల్ ను తరలించి లక్ష రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ తరలింపును ప్రశ్నించిన స్థానిక సర్పంచ్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు నిర్వాహకులు విశ్వసముద్రం సంస్థ ద్వారా మూలపేట పోర్టు పనులకు గ్రావెల్ ను తరలిస్తున్నామని చెప్తున్నారు. ఆర్డర్ కాపీ కావాలంటే ఆర్డిఓ కెళ్లి అడగండని దురుసుగా సమాధానం ఇచ్చారు. అయితే సర్వేనెంబర్ 71 లో ఉన్న ఈ కొండను గ్రామానికి చెందిన మండపాక నర్సింగరావు 2020-30 సంవత్సరం వరకు లీజుకు తీసుకున్నారు. ప్రతి యాడాది హెక్టార్ కు 65 వేల రూపాయలు ప్రభుత్వానికి చెల్లిస్తున్నామని లీజు దారుడు తెలియజేశారు. లీజు కు ఇచ్చిన గ్రావెల్ కొండను ఇతరులు తరలించుకు పోతున్నారని జిల్లా మైన్స్ విజిలెన్స్, రెవెన్యూ అధికారులకు తెలియజేసిన ఫలితం లేకుండా పోయిందని లీజుదారుడు వాపోయారు. మైన్స్ విజిలెన్స్ కమిషనర్ కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఏడి అశోక్ వచ్చి సంఘనా స్థలాన్ని పరిశీలించి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ టిప్పర్లను సీజ్ చేయాలని పోలీసులకు తెలియజేశారు. సీజ్ చేసిన గంటలోపే మళ్ళీ గ్రావెల్ ను తరలించు ప్రక్రియ ప్రారంభం కావడంతో సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోర్టు పేరుతో ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ గ్రావెల్ ను తరలించుకు పోయి కొందరు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు తాసిల్దారును సంప్రదించగా ఆర్వో కాన్ఫరెన్స్ లో ఉన్నానని అన్నారే గాని విషయం తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం గమనర్హం.

## పాలిసెట్లో టి. అర్జాపురం విద్యార్థికి ఉత్తమ ర్యాంక్



**రావికమతం, మే 14, మేజర్‌న్యూస్:** మండలంలో టి. అర్జాపురం గ్రామానికి చెందిన డొంక సాయి లోకేష్ కు 1775 ర్యాంకు సాధించారు. ఎడాది నిర్వహించిన పాలిసెట్ పరీక్షల్లో 1.39,840 మంది విద్యార్థులు పాల్గొన్న విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం వీటికి సంబంధించి ఫలితాలు వెలుపడ్డాయి. దీనిలో అర్జాపురం హైస్కూల్లో చదివిన సాయి లోకేష్ 109 మార్కులు సాధించి 1775 ర్యాంకు సాధించారు. గ్రామానికి చెందిన సి ఆర్ పి జి రామారావు శిక్షణ వలనే తనకు ఈ ర్యాంకు వచ్చిందని విద్యార్థి తెలిపారు. కాగా పదో తరగతి పరీక్షల్లో 566 మార్కులు సాధించి అర్జపురం హైస్కూల్ టాపర్ గా సాయి లోకేష్ నిలిచిన విషయం తెలిసిందే.

## సింధూరా జలసిరితో నీటి కష్టాలు తీరు

### : ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, మే 14, మేజర్‌న్యూస్:** సింధూరా జలసిరితో నీటి కష్టాలు తీరనున్నాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు.పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ ప్రజల తో పాటు నియోజకవర్గ ప్రజలు కూడా మంచినీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని,నీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో మహిళలు తాగునీటి కష్టాలు చూసి తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు ద్వారా పట్టణానికి నీరు అందించడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆనందం వ్యక్తం చేశారు.కాశీబుగ్గలో ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు ద్వారా పట్టణానికి నీరు అందించేందుకు రూ. 63 లక్షలు వ్యయంతో నిర్మించిన సిందురా జలసిరిను బుధవారం సాయంత్రం ఆమె ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పట్టణ ప్రజలు తాగునీరు కోసం పడుతున్న ఇబ్బందులు చూసి ఎలాగైనా నీరు అందించాలని దృడ సంకల్పంతో ముందుకు సాగానని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు,రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండల్కర్ సహాయంతో ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు ద్వారా నీటిని మున్సిపాలిటీకు తీసుకురాగలిగామని చెప్పారు.ఎన్ని ఇబ్బందులు వచ్చినా అన్నింటినీ అధిగమించి ముందుకు వెళ్ళడంతో తాగునీరు సరఫరాకు ఇబ్బందులు తొలుగు తున్నాయని అన్నారు.గత ప్రభుత్వంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంత్రి హెూదాలో ఉన్నపటికీ వంశధార నీరు శివారు భూములకు అందించలేక పోయారని,కనీసం మున్సిపాలిటీకు తాగునీరు ఇవ్వలేని పరిస్థితిలో ఉండేదన్నారు.తాను సాధరణ ఎమ్మెల్యేగా సాగునీరు,తాగునీరు అందించి నప్పుడు నాలుగేళ్లు మంత్రిగా ఉండి ఎందుకు పనులు చేయలేకపోయారని ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.అప్పటి కేంద్ర మంత్రి దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు తీసుకువస్తే ఆ ప్రాజెక్టు నుంచి మున్సిపాలిటీకు నీరు సరఫరా కావడం ఆనందంగా ఉందన్నారు.నా తండ్రి గౌతు శివాజీ సొంత పార్టీ పైనే గెడ్డం దీక్ష చేసి ఆఫ్ షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి చంద్రబాబు నాయుడు స్పందించి రూ. 450 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు.తాను ఎమ్మెల్యేగా పదవి చేపట్టి కొద్ది నెలలకే రెండు అంశాల పై తనకు సంతృప్తి ఇచ్చాయని అన్నారు.రైతాంగానికి వంశధార, మున్సిపాలిటీకు తాగునీరు సరఫరా చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు వేరే పార్టీ అయినప్పటికీ మున్సిపాలిటీ అభివృద్ధికు సహాకారం అందిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నా తండ్రి గౌతు శివాజీ ఎమ్మెల్యేగా పని చేస్తున్న సమయంలో సాగునీటి ప్రాజెక్టుల పైనే దృష్టి పెట్టారని,ఆయన్ని ఆదర్శంగా తీసుకుని సాగునీరు,తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికై సమయంలో నా తండ్రి గౌతు లచ్చన్న నందమూరి తారక రామారావు దయవల్ల గెలిచానని,రెండో సారి గెలిస్తే సింపతీ, మూడోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే పనులు చేయడం వల్ల అని బహిరంగ సభలో చెప్పేవారని,కానీ నా కుమారై అతి తక్కువ సమయంలో మొదటి సారి ఎమ్మెల్యే గా గెలిచి ఒక వైపు పంట భూములకు సాగునీరు మరోవైపు పట్టణ ప్రజలకు తాగునీరు అందించడం గర్వంగా ఉందన్నారు. ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు శ్వేత పత్రం అంటే తెలియదని ఆయన డాక్టర్ గా ఉన్న సమయంలో రోగులకు తెల్ల కాగితం పై మందులు వ్రాస్తే ఆయన మందుల దుకాణాల్లో మందులు అమ్ముకోవడం కాదని ఎద్దేవా చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులు గౌతు శివాజీ, గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు డొక్కరి శంకర్, ఎం నరేంద్ర, మల్లా శ్రీనివాసరావు, దువ్వాడ శ్రీకాంత్ దడియాల నర్సింహులు కొండే నర్సింహులు, వార్డు కౌన్సిలర్ డిక్కల ఆనంద్, సిహెచ్ రామకృష్ణ, మున్సిపల్ డిఇ కనకరాజు ఎఇ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా వల్ల కలిగే అనర్ధాలను తెలిపేందుకే ఈ గ్రామసభ

### - కొత్త భూమిలో ఎక్సైజ్ సీఐ కెవి పాపు నాయుడు



**కే కోటపాడు, మే 14, మేజర్‌న్యూస్:** నాటు సారా వల్ల కలిగే అనర్ధాలను తెలిపేందుకే ఈ గ్రామసభను ఏర్పాటు చేస్తున్నామని, చోడవరం ఎక్సైజ్ సి ఐ కెవి పాపు నాయుడు అన్నారు. రాత్రి మండలంలోని శృంగవరం శివారు కొత్త భూమి గ్రామంలో నాటు సారా తయారీదారులందరికీ ఆ గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ సీఐ కెవి పాపనాయుడు ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు నాటు సారావలన కలిగే అనర్ధాలను వివరించారు. కోటపాడు మండలానికి సంబంధించి నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఇంతవరకు 20 కేసులలో 22 వ్యక్తులను అరెస్ట్ చేసి125 లీటర్లు సారా మరియు 54000 బెల్లం పులుపులను ధ్వంసం చేసామన్నారు. అదేవిధంగా కోటపాడు మండలం లో నాటుసారా తయారీ, అమ్మకాలు జరిపే 50 మంది వ్యక్తులను గుర్తించి తహసీల్దార్, కోటపాడు వారి ద్వారా వారిపై బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్.129 ప్రకారం బౌండోవర్ కేసులు నమోదు చేయడమైనది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్స్ కె. హనుమంతు, ఎం. శేఖరం ఎక్సైజ్ హెచ్ సి అప్పారావు, మరియు సిబ్బంది, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అల్లూరి ఉత్సవాలకు రంపచోడవరం ఎమ్మెల్యే దంపతులు లక్ష రూపాయలు విరాళం



**కొయ్యూరు, మే 14, మేజర్‌న్యూస్:** అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి సందర్భంగా మంప పంచాయతీ లో జరుగుతున్న ఉత్సవాలకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మఠం విజయభాస్కర్ లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ విరాళాన్ని కొయ్యూరు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు మండల తెలుగు యువత కార్యదర్శి బుదరాళ్ల పండు చేతుల మీదుగా మంప గ్రామ పెద్దలు వడపల రామారావు. అప్పలకొండ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా మంప గ్రామస్తులు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మఠం విజయభాస్కర్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు . అలాగే రానున్న కాలంలో మరిన్ని ఉన్నతమైన పదవులను చేపట్టాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## పూర్తిస్థాయి వేతనానికి నిర్దేశించిన పని పూర్తి చేయాలి

### : డుమా పిడి పూర్ణిమ దేవి



**రావికమతం, మే 14, మేజర్‌న్యూస్:** ఉపాధి వేతన దారులు నిర్దేశించిన పనిని పూర్తి చేసిన పక్షంలో రోజుకు 307 రూపాయలు గిట్టుబాటు అవుతుందని డుమా పిడి పూర్ణిమ దేవి తెలిపారు. మండలంలో చీమలపాడు లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన వేతనం గిట్టుబాటుకు ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం మట్టి తవ్వాలని తెలిపారు. సమయం కొలమానం కాదన్నారు. ప్రతి ఇంటి వద్ద కంపోస్ట్ పిట్టు కు కూడా ఉపాధి పథకం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఫారం పాండ్స్ ఏర్పాటుకు రైతులను చైతన్య వంతులను చేయాలని సూచించారు. పనిలోకి రాకుండా నలుగురు కు మస్తర్లు వేస్తున్నారన్న ఫిర్యాదుకు సంబంధించి ఎండిఓ వెంకన్న బాబుకు అదేశాలు జారి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చిన్నారావు ఎండిఓ వెంకన్న బాబు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన పది, ఇంటర్ విద్యార్థులు



**చింతపల్లి, మే 14, మేజర్‌న్యూస్:** ఏజెన్సీ లోని గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో ఉన్న ఏకలవ్య పాఠశాలలోని పది, ఇంటర్ విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. శత శాతం ఉత్తీర్ణత సాధించి ఆ కళాశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని ,కళాశాల ప్రధానాచార్యుడు ఎం వి రమణ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ కళాశాల నుండి పదవ తరగతి విద్యార్థులు 60 మంది పరీక్షలకు హాజరు కాగా, 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. అదే క్రమం లో ఇంటర్మీడియట్ పరీక్షల్లో 74 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 74 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యం లో ఏకలవ్య పాఠశాలలో పరీక్షల కు హాజరైన విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించడం తో విద్యార్థులను, అందుకు కృషిచేసిన ఉపాధ్యాయు లందరికీ, ఈ సందర్భంగా ఆయన అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు

## రైతు సేవా కేంద్రాలలో రైతుల వివరాలు నమోదు చేసుకోవాలి



**చింతపల్లి, మే 14, మేజర్‌న్యూస్:** ఏజెన్సీలోని గూడెం కొత్త వీధి మండలం లోని రైతు లందరూ అన్నదాత సుఖీభవ పథకం ను లబ్ది పొందేందుకు గ్రామ సచివాలయాల లోని రైతు సేవా కేంద్రం లలో, రైతులు తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని, వ్యవసాయ అధికారి మధు సూదన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచి వాలయం రైతు సేవా కేంద్రం లోని అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా మండలం లోని రైతులు అందరూ ఈనెల 20 వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు ఆర్ఓ.ఎఫ్ఆర్, రెవెన్యూ పట్టాలు కలిగిన రైతులు కూడా అర్హులని ఆయన అన్నారు. రైతులు తమ వివరాలు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు ఈ నేపథ్యంలో రైతులందరూఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## హెచ్ఐవి, టీబీపై అవగాహన కళాజాత



**దుంబ్రిగుడ, మే 14, మేజర్‌న్యూస్:** అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకుఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం కించుమండ వారపు సంతలో మన్య సీమ కళాజాత హెచ్ఐవి, టీబీ పై అవగాహన కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, ఎయిడ్స్ రాకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలపై, టీబి వల్ల నష్టాలు, టీబి రాకుండా ఉండేందుకు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి దానిపై కళాజాత ద్వారా నాటిక రూపంలో వారపు సంతకు వచ్చిన గిరిజనులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మన్యా సీమ కళాజాత అధ్యక్షులు అప్పలరాజు, రామారావు, ఈశ్వరరావు, అచ్చి బాబు తదితరులు పాల్గొన్నారు.

## పిసిరి మామిడి, పకాబు అంగన్వాడి కేంద్రాల గ్రీవెన్స్ లపై విచారణ

### - ఐసిడిఎస్ సిడి పిఒ విచారణాధికారి లక్ష్మీ దేవి



**చింతపల్లి, మే 14, మేజర్‌న్యూస్:** చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధి లోని అంగన్వాడి సిబ్బంది ఖాళీల భర్తీ విషయంలో అందిన గ్రీవెన్స్/ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపినట్లు, ఐ సి డి ఎస్ విచారణాధికారి (గూడెం కొత్త వీధి సిడిపిఒ) ఏ లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం చింతప ల్లి మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని పిసిరి మామిడి, పకాబు గ్రామం లోని అంగన్వాడి కేంద్రం లను చింతపల్లి ఐసిడిఎస్ సిడిపిఒ. జి వి రమణ (రమణి)తో కలిసి ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పిసిరి మామిడి, పకాబు గ్రామంలో నీ అంగన్వా డీ కేంద్రముల సంబంధించి అందిన గ్రీవెన్స్/ఫిర్యాదులు మేరకు ఆయా గ్రామాలలోని అంగన్వాడి కేంద్రం లను సందర్శించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో వచ్చిన ఫిర్యాదుల (గ్రీవెన్స్)మేరకు పరిష్కారం నిమిత్తం విచారణ చేపట్టినట్లు ఆమె తెలిపారు. అయితే ఈ విచారణలో పిర్యాదుదారు అందుబాటులో లేకపోవడంతో గ్రామస్తుల తో చర్చించడం జరిగిందని ఆమె తెలిపారు.గురువారం మరలా గ్రామమును సందర్శించడం జరుగుతుందని, విచారణకు అందుబాటు లో ఉండాలని గ్రామస్తులకు వారి కుటుంబసభ్యులకు తెలియ జేయడం జరిగిందని ఆమె తెలిపారు.అనంతరం పిసిరిమామిడి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంను సందర్శించి ,విచారణ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పకాబు అంగన్వాడి కేంద్రం సిబ్బంది నియామకంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గ్రామాన్ని సందర్శించడం జరిగిందన్నారు. ఈ మేరకు ఫిర్యాదు దారులను, గ్రామస్తు లను సమావేశ పరచి విచా రణ నిర్వహించడం జరిగిందన్నారు. పకాబు గ్రామాలలోని అంగన్వాడి కేంద్రంలకు సంబంధించి, చేపట్టిన విచార ణ నివేదికలను ఉన్నతాధి కారులకు సమర్పించ నున్నట్లు ఆమె తెలిపారు.ఐసిడిఎస్ ఏ సి డి పి ఓ .,ఎం.రామలక్ష్మి, సూపర్ వైజర్లు ఎస్ కే. గౌహారున్నిసా, అప్పల నరసమ్మ తో పాటు పిసిరి మామిడి, పకాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలి

### : జిల్లా కలెక్టరు ఎమ్. జాహ్నవి



**అనకాపల్లి ప్రతినిధి, మే 14, మేజర్‌న్యూస్:** జిల్లాలో ఏర్పాటుచేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని జాయింటు కలెక్టరు మరియు ఇంచార్జి జిల్లా కలెక్టరు ఎమ్. జాహ్నవి తెలిపారు. బుధవారం జాయింటు కలెక్టరు కార్యాలయంలో వేసవి క్రీడా శిబిరాల క్రీడాకారులకు క్రీడా పరికరాలు పంపిణీ చేసారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణా శిబిరా లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. విద్యార్థులందరూ క్రీడా శిబిరాలను విని యోగించుకొని ఆటలలో బాగా రాణించాలని, భవిష్యత్తులో పతకాలు సాధించాలని తెలిపారు. ఆటల వలన విద్యార్థుల మనోవికాశం పెరుగుతుం దని,ఆరోగ్యం బాగుంటుందని, చదువులో రాణిస్తారని కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి క్రీడా శిబిరానికి అయిదువేల రూపాయలు విలువచేసే క్రీడా పరికరాలను పంపిణీచేయడం జరిగిందని తెలిపారు. క్రీడా పరికరాల నాణ్యత గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎల్. వి.రమణ క్రీడా శిక్షణా శిబిరాల వివరాలు తెలియజేస్తూ జిల్లాలో ఏర్పాటు చేసిన 50 శిక్షణా శిబిరాలకు 982 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని, వారిలో 612 మంది బాలురు, 370 మంది బాలికలు ఉన్నారని తెలిపారు.వీరికి 20 క్రీడా అంశాలలో శిక్షణ అందిస్తు న్నట్లు తెలిపారు.8 నుండి 14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులలో ప్రతిభా వంతులను గుర్తించి వారిని ప్రోత్సహించడం కోసం ప్రతి సంవ త్సరం క్రీడా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కో కో ఆటలో జాతీయ స్థాయి లో రజత పతక విజేత శ్యామ్ ప్రసాద్‌ను ఇటీవల జరిగిన సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలలో వెండి పతకం సాధించినందుకు ఇంచార్జి కలెక్టరు అభినం దించారు.కోచ్‌లు కె.త్రిమూర్తులు,రెహమాన్, చిరంజీవి, రమేష్ పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు ప్రకటనపై ఆదివాసుల హర్షం

### - సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

### - ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులు



**అరకులోయ, మే14, మేజర్‌న్యూస్:** గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే ఇవ్వాలని రాష్ట్ర కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ఆదివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్ల క్రితం న్యాయస్థానం రద్దు చేసిన జీవో నెంబర్ 3కు ప్రత్యామ్నాయంగా మరొక జీవోను తీసుకువచ్చి శతశాతం ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఇటీవల ప్రకటించడంతో ఆదివాసులంతా ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైపోతున్నారు. సీఎం చంద్రబాబు తాజా ప్రకటనతో ఆనందంలో మునిగి పోయిన ఆదివాసులు ఏపీ ఎస్ ఆర్ టి సి విజయనగరం జోన్ చైర్మన్,తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సియారి.దొన్నుదొర నేతృత్వంలో బుధవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు.స్థానిక పెదలబుడు మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వరకు నినాదాలతో కొనసాగింది. అంతకుముందు నాయకుడు దొన్నుదొర స్వగృహంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆదివాసులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్,నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి సియారి. దొన్నుదొర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజనుల పక్షపాతి అన్నారు.గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే ఇవ్వాలని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుందని ఆయన చెప్పారు.జీవో నెంబర్3 రద్దుతో అన్యాయానికి గురైన ఆదివాసులకు సంపూర్ణంగా తగు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా గత సంవత్సరం జనవరి మూడో వారంలో అరకులోయలో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు జీవో నెంబర్ 3పై మాట్లాడిన మాటను, ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు కసరత్తు చేస్తున్నారని దొన్న దొర తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెట్టెలి. దాసుబాబు,శెట్టి.బాబురావు, పొద్దు.అమ్మన్న,ఎల్. మహాదేవ్,కె.ఒనాది,పాడి చందు,త్రినాధరావు, దామోదర్,కిల్లో.నాగరాజు,పి. సదానందం,బూర్జలక్ష్మి,నీరజ, గౌరీ,బోరి బోరి.లక్ష్మి, తులావతి,పాంగి మిన్ను, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తారువలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సమావేశం



**దేవరాపల్లి, మే 14, మేజర్‌న్యూస్:** మండలంలోని తారువ గ్రామంలో సర్పంచ్ గొంప వరహాలమ్మ అధ్యక్షతన బుధవారం ప్రకృతి కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి రైతు నవధాన్యాలు వేసుకోవాలని రైతులకు సూచించారు. ఉత్తమ రైతులు ఇద్దరు కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లు శ్రీనివాసరావు, రెడ్డి అశోక్ కుమార్, రెడ్డి సురేష్, రాయపు రెడ్డి సత్యనారాయణ, చిటికెల రాము, వి ఏ ఏ లు బాబు, డివిజన్ ఇంచార్జ్ ఏ నాయుడు బాబు, యూనిట్ ఇంచార్జ్ చెల్లయ్యమ్మ, ఆదర్శ రైతులు మలిరెడ్డి మహాలక్ష్మి నాయుడు, జాగరపు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త స్కూల్లు మంజూరు

**- ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు**



**అనకాపల్లి ప్రతినిధి మే 14, మేజర్‌న్యూస్:** మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతలా రామకృష్ణ కృషి ఫలితం గా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చి అనకాపల్లి మండలానికి స్కూల్ మంజూరు చేయించారు.ఉమ్మడి విశాఖ జిల్లా కు నూతనంగా 33 హైస్కూలు మంజూరు చేసిన విద్యాశాఖ మంత్రినారా లోకేష్ జి.ఓ. నెంబరు 117 సవరణలో భాగంగా అనకాపల్లి జిల్లాలోకొన్ని స్కూళ్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడున్న యు.పి. స్కూళ్ల స్థానం లో ఆయా పాఠశాలలు ఉన్నతీకరించబడ్డాయి. అక్కడి విద్యార్థుల సంఖ్యను బట్టి ఆ పాఠశాలలు అప్ గ్రేడ్ అయ్యాయి. అనకాపల్లి మండలం లో బగులు వాడ,కుంచంగి, ముత్రాసుకాలనీ, రామాపురం, సిరసపల్లి గ్రామాల్లో పాఠశాల స్థాయి పెరిగింది. తమ గ్రామాల్లో నూతన హైస్కూల్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

## పాలిటెక్నికల్, ఏపీఆర్జేసీ ఫలితాలలో శ్రీ జ్ఞాన జ్యోతి విద్యార్థుల ప్రతిభ..



**నరసన్నపేట, మే 14, మేజర్‌న్యూస్:** నరసన్నపేట పట్టణంలోని శ్రీ జ్ఞాన జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన పాలిటెక్నికల్ ఎంట్రన్స్ పరీక్ష, ఏపీఆర్జేసీ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారు. నేతింటి లలిత పాలిటెక్నికల్ 532 ర్యాంక్, వెలమల కల్పన 954 ర్యాంక్, గుజ్జిడి రస్మిత 1094 ర్యాంక్, కొరికాన గుణ శ్రీ 1452 ర్యాంక్ సాధించారు. ఏపీఆర్జేసీలో వెలమల రాజేష్ 261ర్యాంక్, నేతింటి లలిత, 458 ర్యాంక్, గుజ్జుడి రస్మిత 461 ర్యాంక్ , కొరికాన గుణ శ్రీ 799 ర్యాంక్, వెలమల కల్పన 957 ర్యాంక్ లు సాధించారు. ఏపీ పాలిటెక్నికల్ ఏపీఆర్జేసీ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ర్యాంకుల సాధించిన విద్యార్థులను శ్రీ జ్ఞాన జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్య ప్రతినిధులు వెలమల భాస్కరరావు, బోర రామారావు, పాగోటి లక్ష్మి, తర్ర సత్యనారాయణ అభినందించారు.

## కళింగపట్నంపై... చిక్కోల్ చిరుత గెలుపు



**ఆమదాలవలస, మే 14, మేజర్‌న్యూస్:** ఆమదాలవలస హైస్కూల్ మైదానంలో గడిచిన 20 రోజులుగా ఎమ్మెల్యే కప్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న విషయం తెలిసిందే. బుధవారం జరిగిన సెమీఫైనల్స్ లో చిక్కోలు చిరుత... కళింగపట్నం జట్లు మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిక్కోల్ చిరుత టీం 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 183 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన కళింగపట్నం జట్టు 11 బాల్స్ కి 34 పరుగులు అవసరం కాగా వరుణ దేవుడు ఆటకు అడ్డుపడ్డయ్యాడు. క్రికెట్ మ్యాచ్ రూల్స్ ప్రకారం పరుగులు, ఓవర్లు లెక్క కట్టిన క్రికెట్ నిర్వహకులు, 19 పరుగులతో చిక్కోల్ చిరుత విజయం సాధించినట్లు ప్రకటించారు. ఈ మ్యాచ్ కి ఎంపైర్ గా కె. సుదర్శన్ వ్యవహరించారు.మ్యాచ్ నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్, విజేతలకు మెమొంటోలను అందజేశారు.

# ఉగ్రదాడులు, విపత్తులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**: డి.ఆర్.ఓ. వై.సత్యన్నారాయణ రావు**

**- గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ లో ప్రభుత్వ శాఖల మాక్ డ్రిల్**



**అనకాపల్లి ప్రతినిధి, మే 14, మేజర్‌న్యూస్:** ఉగ్రదాడులు, విపత్తులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యన్నారాయణ రావు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం అనకాపల్లి పట్టణం బైపాస్ రోడ్డు లోని జయభేరి మారుతి షోరూం ఎదురుగా ఉన్న గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ లో శేషాద్రి బ్లాక్ వద్ద జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్ ఆసాంతం ఆశక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా పాత్రికేయులతో డి.అర్.ఓ. మాట్లాడుతూ గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ లో శేషాద్రి బ్లాక్ లో మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన (ఎస్ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్) దళాలు మరియు రెవెన్యూ,



పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖలు, జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన (ఎస్ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్) దళాలు విన్యాసాల్లో భాగస్వామ్యం అయ్యయ్యాన్నారు. అపార్ట్మెంట్లో సుమారుగా 400 నుంచి 500 దాకా జనాభా ఉంటారని ఇలాంటి అపార్ట్మెంట్ లలో ఎక్కువగా మానవ నష్టాలు ఉండే అవకాశాలుంటా యని, అప్పుడు బాంబు పేలితే, ఆ భవనం కూలిపోతే ఏం చేయాలి, సైరన్ మోగినప్పటి నుంచి చివరికి వారు రెస్క్యూ చేసి హాస్పిటల్ కి చేర్చేదాకా వివిధ రకాల డ్రిల్స్ ని మొదట అధికారులు చూపించడం జరిగిందన్నారు. వినూత్నమైన పరికరాల గురించి వివరించడం జరిగిందని పేర్కొన్నారు. విపత్తుల యాజమాన్య సంస్థ సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులను నిర్వహిస్తారని అన్నారు. అన్ని శాఖాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తినష్టం జరగకుండా చూడాలని అన్నారు. అధికారులు కూడా డ్రిల్ గురించి నేర్చుకున్నారన్నారు. తరువాత ఇక్కడున్న పౌరులచేత రెస్క్యూ చేయించడం జరిగిందని తెలిపారు. మాక్ డ్రిల్ పట్ల పిల్లలు, మహిళలకు, యువకులకి ఎక్కువగా అవగాహన రావాలన్మారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో సీజ్ ఫైర్ ఉన్నా సరే ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం యంత్రాంగం వచ్చినప్పుడు వారికి ఎలా సహకరించాలి అనేది తెలుసుకోవాలన్నారు. అంతకుముందు అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే, విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే, యుద్ధం వల్ల బాంబులు పడి లేదా గ్యాస్ లీక్, షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే, అలాంటి సమయంలో ప్రభుత్వం ఏవిధమైన సహాయ చర్యలు తీసుకుంటుంది, వివిధ ప్రభుత్వ శాఖలు ఎటువంటి చర్యలు చేపడతాయి. ఆయా శాఖల సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఏవిధంగా కాపాడతారు అన్న అంశాలను కళ్లకు కట్టినట్టు చేసి చూపించారు. బాంబులు, ఇతర ప్రేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని కూడా వివరించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ, ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్,తదితర శాఖలు ఈ విన్యాసాల్లో భాగస్వాములు అయ్యాయి. పై అంతస్థులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడం, క్షతగాత్రులను అక్కడినుంచి క్రిందకి దించడం, వారికి వైద్య సహాయాన్ని అందించడం, హుటాహుటిన అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించడం, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయ పడటం, అప్పటికీ పరిస్థితి అదుపులోనికి రాని పక్షంలో ఎన్డిఆర్ఎఫ్ దళాలు జత కలవడం, ప్రజల ప్రాణాలను రక్షించి, సహాయ చర్యలు చేపట్టడం తదితర అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు, మానవ ప్రేరేపిత ప్రమాదాలను సైతం ఎదుర్కొనే విధానాన్ని వివరించి, అధికారులు తమ సన్నద్ధతను తెలియజేశారు. అనకాపల్లి ఇంచార్జి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతి ప్రభ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్ వెంకటరమణ, ఎన్.డి.ఆర్.ఎఫ్. ఇన్స్పెక్టర్ సుశాంత్ కుమార్, అగ్ని మపక, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్. ఎఫ్ దళాలు, గ్రీన్ హిల్స్ గ్రేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ పౌరులు, తదితరులు భాగస్వామ్య ంమయ్యారు.

# అంగూరు ఇసుక ర్యాంపు రెవిన్యూ అధికారులు దాడులు

**- రెండు ప్రోక్లీనర్లు, ఒక లారీ, మూడు ట్రిప్పర్లు సీజ్.**

**- వాహనాలు అప్పగించేందుకు యజమానులు నిరాకరణ.**

**- స్వాధీనం చేసుకోవాలని పోలీసులకు పిర్యాదు చేసిన తహసీల్దార్**

**కొత్తూరు, మే 14, మేజర్‌న్యూస్:** కొత్తూరు మండలం అంగూరు ఇసుక ర్యాంపు పై తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవిన్యూ అధికారులు దాడి చేసి వాహ నాలు సీజ్ చేశారు. రెండు ప్రోక్లీనర్లు,14 టైర్లు భారీ లారీ, మూడు ట్రిప్పర్లు సీజ్ చేసారు. అంగూరు వద్ద వంశధార నదీ గర్భంలో ప్రభుత్వ నిబంధనలు కు వ్యతిరేకంగా రెండు ప్రోక్లీనర్లు తో ఇసుక త్రవ్వకాలు జరిపి లారీలు, ట్రిప్పర్లు కు లోడింగ్ చేస్తుండగా రెవిన్యూ సిబ్బంది వెళ్లి వాహనాలను సీజ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్లు సమావేశం జరుగు తుండగా కొత్తూరు తహసీల్దార్ బాలకృష్ణ కు అక్రమ త్రవ్వకాలు పై ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సమాచారం రాగానే సిబ్బందిని అప్రమత్తం చేసి వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించిన వెంటనే కర్లెమ్మ వి ఆర్ ఓ గిరీష్ పట్నాయిక్, స్థానిక వి ఆర్ ఓ,సిబ్బంది వెళ్లి త్రవ్వకాలను అడ్డు కొని వాహనాలు సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలు అప్పగించాలని పూర్తి వివరాలు లో రసీదు ఇచ్చారు.రసీదు తీసుకొని, వాహనాలు అప్పగించాడానికి వాహనదారులు నిరాకరించారు. విషయం తెలుసు కొన్న తహసీల్దార్ బాలకృష్ణ వాహనాలు స్వాదీనం చేసుకోవాలని స్థానిక పోలీసులకు పిర్యాదు చేశారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ సి హెచ్ ప్రసాదరావు, యస్ ఐ అహమ్మద్ అలీ అంగూరు వెళ్లి వాహనాల తాళాలను స్వాధీనం చేసుకొన్నారు. తహసీల్దార్ పిర్యాదు పై కేసు నమోదుకు పోలీసులు చర్యలు తీసుకొంటున్నారు.







# ప్రజలను ఆకట్టుకున్న సంఘం శరణం గచ్చామి నాటక ప్రదర్శన

**- రాజ్యాంగ విలువలు నేర్పిన అంబేద్కర్ జీవిత చరిత్ర**





**నర్సీపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** కెవిపిఎస్ అద్వర్యంలో సంఘం శరణం గచ్చామి నాటకం అభ్యుదయ ఆర్ట్స్ ఆకాడమీ వారిచే నర్సీపట్నం సిటీ క్లబ్ లో బుధవారం రాత్రి ప్రదర్శించడం జరిగింది. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి అద్యక్షతన ఈ నాటకం ప్రారంభం అయ్యింది.ముందుగా డా. బి ఆర్ అంబేద్కర్ గారి చిత్ర పటానికి నర్సీపట్నం ఎంఈఓ సిహెచ్ తలుపులు టి.విజయ కుమార్ ,సిఐటియు రాష్ట్ర ఉపాద్యక్షులు జి కొటేశ్వరరావు లు పూల మాల వేసి ప్రారంభించడం జిరిగింది. అంబేద్కర్ జీవిత చరిత్రను తెలియజేస్తూ ప్రదర్శించిన సంఘం శరణం గచ్చామి నాటకం ప్రజలను ఆకట్టుకుంది దేశం కోసం ప్రజల కోసం త్యాగం చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రదర్శన ఆహుతులను కంటనీరు పెట్టించింది రాజ్యాంగ విలువలు నేర్పినట్లు పదవులు మెచ్చుకున్నారు. అభ్యుదయ నాటక బృందాన్ని పదవులు అభినందించారు. అభ్యుదయ నాటక బృందం ఆంధ్ర,తెలంగాణ,కర్ణాట రాష్ట్రాలలో తెలుగు,హిందీ,ఇంగ్లీషు భాషలలో 800 ప్రదర్శనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓతలుపులు మాట్లాడుతూ డా బి ఆర్అంబేద్కర్ జీవితం నేటి తరానికి ఆదర్శనియం అని వారు దేశానికి అందించిన సేవలు యనలేనివని అన్నారు. నాటకం లో అనేక సన్నివేశాలు ప్రజలను అకట్టుకున్నాయి. అంబేద్కర్ జీవితంపై స్ఫూర్తివంతంగా జరిగిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన అంబేద్కర్ నాటకం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దృశ్య కావ్యంలా నాటక ప్రదర్శన జరిగింది. పలు దృశ్యాలకు ప్రేక్షకులు కన్నీటిపర్యంతం అయ్యారు. అంబేద్కర్ బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, నిమ్నజాతుల హక్కుల కోసం చేసిన పోరాటాలు, రాజ్యాంగ రచనతో పాటు దేశ సేవలను ఈ నాటకంలో ప్రదర్శించారు.నాటకంలో చేసిన కళారూత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.ప్రారంభోత్సవ సమావేశంలో కార్యక్రమంలో జనవ విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయుకులు కె. త్రిమూర్తులు రెడ్డి, యూటిఎఫ్ సీనియర్ నాయకలు ఎం చిట్టియ్య,ప్రభుదాస్, విశ్రాంతి ఆచ్యారులు యలమంద ,కొటేశ్వరరావు,విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండాడ యాక్ట్స్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా




**మధురవాడ, మే 14, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం జోన్ 2 పరిధి ఎండాడ 8 వ వార్డు లో అంబేద్కర్ పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా నడపబడుచున్న యాక్ట్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18 తేదీ ఆదివారం నాడు ఉదయం 10 గంటలనుండి 4 గంటలవరకు మెగా జాబ్ మేళా జరగనుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ చైర్మన్ బి రాజారావు తెలియచేశారు. ఈ జాబ్ మేళా కు 20 పెద్ద పేరొందిన కంపెనీ లు 250 పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని విద్యా సంస్థల సెక్రెటరీ ప్రభాకర్, తెలియజేశారు .10 వ క్లాస్ నుండి పీజీ వరకూ విద్యార్థులు ఈ అవకాశం ఉందని ప్రిన్సిపాల్ పద్మారావు అన్నారు.భవిష్యత్ లో మరిన్ని జాబ్ మేళా లు నిర్వహిస్తామని అలాగే ఈ యాక్ట్స్ డిగ్రీ కళాశాల లాభాపేక్ష లేకుండా పనిచేసే సంస్థ అని విద్యార్థులు దీనిని ఉపయోగించుకొని వారి భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని అంతే కాక పేద విద్యార్థులకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తామని వైస్ చైర్మన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జెసిఐ ప్రతినిధి శ్రీనివాస రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు .

## పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటానికి 226 రోజులు




**అక్కయ్యపాలెం, మే 14, మేజర్‌న్యూస్:** పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ అపాలని 226వ రోజు నిరసన దీక్షలో సిఐటియు ప్రధాన కార్యదర్శి కే సత్యనారాయణ మాట్లాడుతూ హాస్పిటల్ ప్రైవేటీకరణ పై రాష్ట్ర లో ఉన్న టిడిపి జనసేన కూటమి ప్రభుత్వం కూడా స్పందించాలి. హాస్పిటల్ టెండర్ వచ్చిన వారిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేట్ వారికి అప్పగించడం అనర్థమని తెలిపారు. విశాఖపట్నం పోర్టు విశాఖ అభివృద్ధికి కీలకమని, ప్రతీ ఏటా మున్సిపాలిటీకి సగటున 65 కోట్ల రూపాయలు పన్నులు కడుతున్న పోర్టును ప్రైవేట్ వారికి ఇచ్చి ధారాదాతత్వం చేయడం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందని అన్నారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రైవేటీకరణపై తీసుకున్న నిర్ణయం అన్యాయమని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ంంఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.సత్యనారయణ, జీ.చిహెచ్. నాయుడు, నాయుడు , రాఘవులు, కే ఎస్ కుమార్ శంకర్ , నరసింహా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణం నియోజకవర్గం పునః రూపకల్పనకై సూచనలు సలహాలు స్వీకరణ

### – 4వ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు

**విశాఖపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రస్తుతం ఉన్న ఎనిమిది జోన్ల పరిధిని పరిపాలనా సౌలభ్యం కొరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధితో పునః రూపకల్పన చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయుటకు సూచనలు సలహాలు స్వీకరించబడునని 4వ జోన్ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు బుధవారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం దక్షిణం నియోజకవర్గం పరిధి పునః రూపకల్పనకై జోన్-4 సూర్య బాగ్ కార్యాలయం లోని సమావేశ మందిరము నందు తే 15-5-2025 (గురువారం) ఉదయం 10.00 గంటలకు 4 వ జోనుకు సంబంధించి ప్రజా ప్రతినిధులు నివాస సంక్షేమ సంఘాల ప్రతినిధులు వివిధ రంగాలలో అనుభవజ్ఞులైన పౌరుల సూచనలు సలహాలు స్వీకరించుటకై సమావేశాన్ని ఏర్పాటు చేయడమైనదని ఆయన తెలిపారు.

## మే 28న 4వ జోన్ లో బహిరంగ వేలం నిర్వహణ

**విశాఖపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 4 జోన్ లో పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, కళ్యాణ మండపం, మార్కెట్లకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని 4వ జోన్ జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జివిఎంసి 4వ జోన్ (సూర్యబాగ్) పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయము (వార్డు నెం.35, నియర్ స్ప్రింగ్ రోడ్) గ్రౌండ్ ఫ్లోర్ నందు 8, 9,10,11, 12,13(Gen) ు 15(SC) షాపు రూములు మరియు మొదటి అంతస్తు నందు 2(%జ) ు 3,4, 5,6,7,8, 9,10,11,12,13,14,15(+వ%) షాపు రూములు, జగదాంబ వాణిజ్య సముదాయము (వార్డు నెం.31) 3,5, 11, 12, 14%ు13(ST) షాపు రూములు, పాత బస్ స్టాండ్ ఫేస్-2(వార్డు నెం.35) 1,2,3,4,5,6,8,10,11,13,14 %ు 7(SC), 9(ST), 12(SC) షాపు రూములు, పాత బస్ స్టాండ్ ఫేస్-1 (వార్డు నెం.35) షాపు నెం.5, పద్మనగర్ వాణిజ్య సముదాయము (వార్డు నెం.39, లక్ష్మీటాకీస్ దగ్గర) 1,4,6,7,11, 12(Gen) ు 8(SC), షాపు రూములు, సూర్యబాగ్ వాణిజ్య సముదాయము (వార్డు నెం.31, నియర్ జివిఎంసి, జోన్-4 ఆఫీసు) 9(ఫస్ట్ ఫ్లోర్) షాపు రూము, టి.ఎస్.ఆర్ వాణిజ్య సముదాయము (వార్డు నెం.31) 34, 35, 37, 38, 39,46, 47,49, 50, 51(Gen) ు 17 (SC) షాపు రూములు, కనకలదిబ్బ వాణిజ్య సముదాయము (వార్డు నెం.31) 07 షాపు రూము, అంబేద్కర్ కళ్యాణ మండపం (వార్డు నెం.37), రెల్లివీధి రోడ్ సైడ్ షిప్ మార్కెట్లును 3 సంవత్సరముల కాల పరిమితికి గుత్తకు ఇచ్చేందుకు 28-05-2025 తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించబడునని జోనల్ కమిషనర్ తెలిపారు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు దరావత్తు సొమ్ము తదితర పూర్తి వివరాలకు 4వ జోనల్ కార్యాలయం పని వేళలో 4వ జోనల్ కార్యాలయం లోని పర్యవేక్షకును సంప్రదించగలరని జోనల్ కమిషనర్లు తెలిపారు.

## నిరుద్యోగ నిర్మూలనకే పరిశ్రమలు ఏర్పాటు: ఎమ్మెల్యే జయకృష్ణ



**సీతంపేట మే 14 మేజర్ న్యూస్:** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన నిరుద్యోగ నిర్మూలన హామీలో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు స్థాపనకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా సీతంపేట మండలం పణుకువలస గ్రామంలో ఎం ఎస్ ఎం ఈ ప్లాంట్ కు పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ బుధవారం శంకుస్థాపన చేసారు. . పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ చేతుల మీదుగా సీతంపేట మండలం పణుకువలస గ్రామంలో 7కోట్ల విలువైన ఎం ఎస్ ఎం ఈ పార్క్ కు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తరిమికొట్టి అభివృద్ధిలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ ను నిలపడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పాలకొండ లాంటి గిరిజన నియోజకవర్గంలో ఈ ప్లాంట్ అందుబాటులోకి వస్తే ఎన్నో గిరిజన కుటుంబాలు అభివృద్ధిలోకి వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. పేదరిక నిర్మూలనలో భాగంగా రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్విరామంగా కృషి చేస్తున్నందుకు వారికి ఎమ్మెల్యే జయక్రిష్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి,ఏ ఎం సి చైర్మన్ సంధ్యారాణి ,తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ పొడిలాపు కృష్ణమూర్తి నాయుడు ,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్ణేన అప్పలనాయుడు ,ఉమ్మడి శ్రీకాకుళం జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు , ఎంపీపీ బొమ్మాళీ భాను , వైస్ ఎంపీపీ వకముడి అనిల్ ,జి సిసి రాష్ట్ర డైరెక్టర్ నిమ్మల నిబ్రహం , పాలకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్ నిమ్మక పాండురంగ,పాలకొండ నియోజకవర్గ ఐటీడీపి కోఆర్డినేటర్ ఇమరక పవన్ ,పాలకొండ టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంట సంతోష్ ,సీతంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సవరతోట మోఖలింఘం ,వీరఘట్టం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జామి లక్ష్మి నారాయణ , పాలకొండ టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉదయాన ఉదయ్ భాస్కర్ ,భూపతి ఆనంద్ ,వీరఘట్టం నాయకులు పొన్నాడ నాగేశ్వరరావు,పాలకొండ జనసేన నాయకులు రాజేష్ ,భామిని సీతంపేట బీజేపీ నాయకులు తిరుపతి ,రవణమ్మ, సీతంపేట జనసేన పార్టీ అధ్యక్షుడు విశ్వనాథం ,పాలకొండ నాయకులు శ్రీధర్, భామిని జనసేన నాయకులు కిరణ్ ,వీరఘట్టం జనసేన నాయకులు జానీ,నీటిసంఘం అధ్యక్షులు చింత ఉమ, జీసీసీ చైర్మన్ రామారావు బాలరాజు పాల్గొన్నారు.


## ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దే బాధ్యత కోచ్ లదే



**విశాఖపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసి శిక్షణనిచ్చి ప్రోత్సహించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్ లలో పాల్గొనే కోచ్ లకు ఎం.వి.పి. కాలనీలోని తన నివాసంలో బుధవారం స్పోర్ట్స్ కిట్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం గర్వించే క్రీడాకారులను తయారు చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. పద్మనాభంలో వాలీ బాల్, రుషికొండ లో వాటర్ స్పోర్ట్స్, కొమ్మాది, బక్కన్నపాలెంలలో ఫుట్ బాల్, రేవిడిలో హ్యాండ్ బాల్, చేపలుప్పాడలో ట్రియతలాన్, కొమ్మాదిలో బాక్సింగ్, మధురవాడలో స్కేటింగ్ కోచింగ్ క్యాంప్ లను నిర్వహిస్తున్నట్లు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ జూన్ గాలియట్ - గంటా కు వివరించారు. అథ్లెటిక్ కోచ్ వైకుంఠ రావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల భరోసాగా నిలిచిన ఎమ్మెస్సార్ ప్రసాద్

### - సేవాభావానికి నిండు నమస్సులు



**విశాఖపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** పాత్రికేయ ప్రపంచంలో ఓ అరుదైన వ్యక్తిత్వం...అవసరంలో ఉన్న జర్నలిస్టులకు కర్తవ్యం కాదు, బాధ్యతగా, మానవతా దృక్పథంతో సహాయాన్ని అందించడమే ఆయన ధ్యేయంగా మలుచుకున్నారు. అలాంటి మానవతా మూర్తి వి డిజిటల్ న్యూస్ బ్యూరో చీఫ్, “నగరంలో నేడు” గ్రూపు అడ్మిన్ ఎమ్మెస్సార్ ప్రసాద్ గారు. ఈరోజు (బుధవారం) జరిగిన తాజా సంఘటన ఆయన సేవాభావానికి, హృదయానికి మరో స్పష్టమైన ఉదాహరణగా నిలిచింది. సీనియర్ పాత్రికేయుడు వడ్డాది ఉదయ్ కుమార్ గారు తన తల్లి సుబ్బలక్ష్మి గారి సంవత్సరిక నిర్వహణకు కొంత ఆర్థిక సహాయం అవసరమని ఎమ్మెస్సార్ ప్రసాద్ గారిని ఆశ్రయించారు. ఎప్పటిలాగే ఆలస్యం చేయకుండా స్పందించిన ఎమ్మెస్సార్, తనవంతు సహాయం అందించడమే కాకుండా, గ్రూపు సభ్యులను కూడా ప్రేరేపించారు.

ఈ మాటలకన్నా సభ్యుల స్పందన మరింత గొప్పదిగా నిలిచింది. కేవలం కొన్ని గంటల్లోనే సభ్యులు ఒక్కొక్కరుగా స్పందిస్తూ సుమారు 50,000 వరకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సంఘటన పాత్రికేయుల ఐక్యతకు, సహృదయతకు, మానవతా విలువలకు నిదర్శనం.

## 15న తూర్పు నియోజకవర్గం పునః రూపకల్పన ప్రతిపాదనలకై సమావేశం

### - 3 వ జోనల్ కమిషనర్ శివప్రసాద్

**విశాఖపట్నం, మే 14, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో ఉన్న ఎనిమిది జోన్ల పరిధిలో పరిపాలనా సౌలభ్యం నేపథ్యంలో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పునః రూపకల్పన చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయుటకు 15వ తేదీన సమావేశం నిర్వహించబడునని 3వ జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్ బుధవారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిధి పునః రూపకల్పనకై ఆశీలుమెట్ట జోన్-3 కార్యాలయం లోని సమావేశ మందిరము నందు తే 15.5.2025 (గురువారం) సాయంత్రం 5.00 గంటలకు 3వ జోనుకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, నివాసిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాలలో అనుభవజ్ఞులైన పౌరుల సూచనలు సలహాలు స్వీకరించుటకై సమావేశాన్ని ఏర్పాటు చేయడమైనదని ఆయన తెలిపారు.